గానకళ సంచికలను
ganakala.in website
ద్వారా పొందవచ్చును.

# గానకళ

సంగీత మాసపత్రిక
#30-1-29, రంగయ్యనాయుడు వీధి, కాకినాడ - 533 001, సెల్: 9441488721

సహాయ సంపాదకులు : **శ్రీ వాసా గోపీనాధరావు** - విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్, - **శ్రీ కె.వి.బ్రహ్మానందం** - విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ. - **శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, సంగీత విమర్శకులు, రచయిత, కాకినాడ

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**సంపుటి - 59** **మార్చి , ఏప్రియల్ - 2022** **సంచిక - 10,11**

**సంపాదకవర్గం :**
శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
శ్రీ నేమాని సోమయాజులు
శ్రీ తాతపూడి వెంకట సుబ్బరాయ శాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి.వర్ధని
శ్రీమతి మల్లాప్రగడ జోగులాంబ
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్.వి.సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**
శ్రీ ఎం.ఎస్.శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్.అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మీదేవి, M.A.,M.A.,M.A.
శ్రీమతి వై. రమాప్రభ, ,M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి.రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై.శేషురాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి

Email:ganakalamagazine@yahoo.co.in
కు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

పేజిలలో ఈ సంచికలో...

**2.** క్షేత్రయ్య పదాలు – మధురభక్తి
– శ్రీ యెల్లాప్రగడ వెంకటనారాయణ శర్మ
**8.** ఇతరుల కష్టము ఎవ్వడెరుగునో అతడే వైష్ణవుడు – మహాత్మాగాంధీ
– శ్రీ మల్లాది సూరిబాబు
**11** దాశరథీ నీ ఋణము దీర్ప నా తరమా?
– శ్రీ మోదుమూడి సుధాకర్
**12.** డి.కె.పట్టమ్మాళ్ –శ్రీ కె.సద్గురు చరణ్
**15.** ఉప్పలపాటి అంకయ్య – శ్రీ అరిపిరాల విశ్వం
**17.** నాట్య సంగీత వాగ్గేయకారులు – తంజావూరు సహోదరులు
– శ్రీ యన్.నజీర్
**19.** నేమాని అంతరంగం – శ్రీ జయంతి సత్యనారాయణశాస్త్రి
**28.** సంగీత సభల కార్యకలాపములు – విహారి

## ముఖచిత్రం

**1.** హైద్రాబాద్‌లో సంగీత సభలు సంయుక్తంగా నిర్వహించిన శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవంలో సత్కరింపబడిన హైద్రాబాద్ సోదరులు – శ్రీ డి.శేషాచారి – శ్రీ డి. రంగాచారి.

**2.** తణుకు శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవ సొసైటి మరియు శ్రీ రాయసం రాజ్యలక్ష్మి సంగీత నృత్యకళాశాల ఆధ్వర్యంలో సన్మానింపబడిన పద్మశ్రీ అన్నవరపు రామస్వామి గారు.

**3.** సంగీతవిద్వాన్ ప్రొ॥ వి. తిరుపతయ్య గారిచే రచింపబడిన "ఆదితాళవర్ణ సర్వస్వము" రెండవ భాగము ఆవిష్కరణ దృశ్యం.

**4.** విశాఖ విజయత్యాగరాజ సంగీత సభలో వీణా విదుషి శ్రీమతి రామవరపు మాధురి దేవికి బిరుదు సన్మాన దృశ్యం.

**5.** సంగీత విద్వాంసులు శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావుగారిచే రచింపబడిన "తూర్పుగోదావరిజిల్లా వాగ్గేయకార వైభవము" గ్రంథాన్ని ఆవిష్కరణ చేస్తున్న మృదంగ విద్వన్మణి శ్రీ వి.కమలాకరరావు, తదితర విద్వాంసులు.

**6.** ప్రఖ్యాత సంగీతసంస్థ కాకినాడ సరస్వతి గానసభలో సత్కరింపబడి తన అనుభవాలను పంచుకుంటున్న పద్మశ్రీ శ్రీ అన్నవరపు రామస్వామి.

# క్షేత్రయ పదాలు : మధురభక్తి

**- యెల్లా ప్రగడ వెంకటనారాయణ శర్మ**

మన యీ తెలుగు భాషను గురించి దేశభాష లందు తెలుగు లెస్సయని యొక ప్రఖ్యాతి ఉండి యున్నది. ఇంకనూ మన యీ తెలుగుభాషకు ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని యొక ప్రఖ్యాతి కూడా ఉండి యున్నది. అంటే ప్రాచ్య భాషలలోని దగు తెలుగు ఇటాలియన్ భాషవంటిది అని భావము. ఈ తెలుగు భాష బహు చక్కనైనదియును, సరళమైనట్టిది యును, అతి సరసమున్నూ బహు చమత్కార యుక్తమున్నూ అత్యంత మృదుమధురమునూ అయినట్టి భాష. ప్రాచ్య భాషలలోనిదగు మన యీ తెలుగు సాహిత్యమునందున నొక ప్రత్యేకమైనట్టి విశిష్టత గలిగి, అది ప్రత్యేకముగానొక విశిష్ట స్థానమును ఆక్రమించి యున్నది. మన యీ తెలుగు భాష బహు పురాతనముగా చాలా కాలమునుండిన్నీ రసజ్ఞుల మనస్సులను రంజింప జేసి వారి యొక్క ప్రశంసలనున్నూ, మన్ననలనున్నూ పొందియున్నది. అనేకమంది కవులు పండిత ప్రకాండులవల్లనున్నూ అలంకార విశేషములను సమకూర్చుకొని యున్నది. మన తెలుగు సాహిత్యంలో ప్రత్యేకముగా పదరచనా సాహిత్యమునందున నదియొక రమణీయ సాహిత్య ప్రక్రియగా పరిణామము జెందియున్నది.

పూర్వమునందు ప్రత్యేకముగా నొకానొక కాలమునందున నీ పద కవితావిశేషము ఒక ప్రత్యేకమైనట్టి విశిష్టస్థానమును గలిగి విరాజిల్లి యుండినది. మహా ప్రభువరేణ్యులు రాజాధిరాజుల యొక్కయును ఆదరణమును పొందియుండినది.

మానవుని స్వభావము ఒక విచిత్ర ప్రవృత్తిని గలిగినట్టిది. సహజముగా తన మనస్సునందలి భావ విశేషములను మానవుడు ఎప్పుడున్నూ గుప్తపఱచి యుంచలేడు. అతనిమానసిక భావము ఏదైనను స్వభావ వైరుధ్యమైనట్టిదయితే అది యొక్క పరిణామమునకు గొప్ప అవరోధమే కాగలదు. అట్టిది క్రమ సౌందర్య వికాసమునకు గొప్ప అవరోధము కాగలుగుచున్నది. పూర్వము నుండిన్నీ మన దేశంలో కవులూ, కళావేత్తలూ సాహిత్యవేత్తలయినట్టి పండితులు మొదలగునట్టి వారందరున్నూ, బహుకాలంగా వారి వారి మానసిక వీధులయందున గొప్పగా, విశృంఖలముగా విహారము నొనర్చియుండిరి. అందువల్లనే కౌశిల కర్మాచరణమును అనుసరించియే మన భారతీయుల యొక్క సంస్కృతీ విశేషము ఆనాటినుండి ఈనాటి వరకున్నూ ఏ మాత్రముగానైనను చెక్కు చెదరకుండానే నిలువబడ గలిగియున్నదనే చెప్పవచ్చును.

సర్వసామాన్యంగా మానవుని జీవితము ఎప్పుడు కూడా ఆత్మానందమును అనుభవింపలేనట్లయితే అట్టి యా జీవితము నిరర్థకమేయగును. అందువల్లను ఆత్మానందము అనునది మానవ జీవితమునకు జీవ ప్రదాయకమైనట్టిది. అట్టి యా ఆత్మానందము అనునదియే ఈ యొక్క విశ్వ విభూతికి మార్గముగానగుచున్నది. ఒక సంస్కృతహృదయ జనితమైనట్టి ఆనంద ప్రవృత్తి యావత్తు ప్రపంచానిన్నీ కూడా ఆనంద విలసితముగా నొనర్పగలుగుచున్నది. ఇట్టి యా మహదానంద మునకు ప్రేమ, విజ్ఞతలు మూలాధారములు అయియున్నవి. కనుకను ఈ ప్రేమ, విజ్ఞతలను నట్టి యా విశేషములు రెండున్నూ రసవత్తర విశేషములనయినట్టి లలితాకళా విశేషముల మూలంగానే సుసాధ్యములు కాగల్గుచున్నవి. పైనను చెప్పియున్నట్టి ఈ ఆత్మానందము అనుదానివల్లనే దివ్యత్వము కూడా సంభవము కాగలుగుచున్నది. ఈ ఆత్మానందము అనుదానియొక్క పరిణామ విశేషము శాంతికి మూలము కాగలుగుచున్నది. ఆ ఆత్మానందమే సౌందర్యోపాసనమునకు గూడను దారి జూపుచున్నది. అందువల్లను ఈ సౌందర్యోపాసనము ఒక గొప్ప లక్ష్యముగా, నొక లక్ష్యసాధనమున కున్నూ, అట్టి యా లక్ష్యసాధనమే అమృతత్వమునకున్నూ మార్గములగుచున్నవి. కనుకను ఇట్టి యా విధముగా అనుపమ సాధనా విశేషము మూలముగా మానవుని యొక్క మానసమును చక్కగా ఊర్ధ్వోన్నత మార్గములోనికి మరలింపగల్గునట్టి యొకానొక మహత్తరమై నట్టి శక్తి ఒక్క కళావిశేషమునకు మాత్రమే ఉండి యున్నది. ఇట్టి యా కళ యనునది సౌందర్యాత్మోన్మీలనమే యగును. ఇట్టి యా రీతిదియగు కళాసహిత ఆత్మయే తన సాటి

మానవులకు ఒక విధమైనట్టి వెలుగు బాటగా నొప్పుచున్నది. ఇట్టి కళాత్మయొక్క సృష్టియే ఒకానొక మహదానందలోకము కాగల్గుచున్నది. కనుకను ఇట్టి యీ రీతిదగునట్టి నిష్కామ ఆనంద ప్రాప్తికి ఆలంబనములుగా మన కళాకారులు మహత్తర కావ్యముల నున్నూ, కళా విశేషములనున్నూ సృష్టించి వాటిని మనకు అందచేసి యున్నట్టి వారైరి. వారంతా కూడా మార్గదర్శకులుగానై, నిత్యులు, శాశ్వతములుగను అయి వెలసియుండిరి.

పైనను వివరింపబడి యుండినట్టి మహనీయులైనట్టి వారిలో మన క్షేత్రయ్య కూడా నొక్కడు అయి యుండెను. ఈ క్షేత్రయ్య మన తెలుగుభాష యందలి నుడికారములనున్నూ, వాటి యొక్క సౌందర్యమునున్నూ అట్టి యా తెలుగు పలుకుబడుల యొక్క ఇంపునున్నూ భాషా సౌందర్యములోగల చమత్కారములనున్నూ, ఇట్టి వాటిని అన్నింటినిన్నీ సమపాళ్ళలో కూర్చి, విద్వజ్జనముల యొక్క మానసంబులను ఆకర్షింపజేసికొన గలిగి నట్టిదియగు తన పదకవిత్వమును రూపొందించి, తెలుగు భాషా సాహిత్య క్షేత్రములో సుసంపన్న మైనట్టిదగు బంగారు పంటను పండించియున్నట్టి రసజ్ఞుడగునట్టి గొప్ప కళావేత్తయై విలసిల్లియండెను.ఆ పైడిపంటయే ఆయన యొక్క పద కవితా విశేషము.

ఈ క్షేత్రజ్ఞుని పదములలో ఒకానొక ప్రత్యేక మగునట్టి విషయము ప్రత్యక్షము అయివుంటుంది. ఈ పదములలోని శృంగార రసోద్భూతమై నట్టి కార్యకలాప విశేషములు కొన్ని తావుల యందున బహు నగ్నముగానే వర్ణింపబడి యున్నవి. ఆయా సన్నివేశములయందునగల పదప్రయోగముల అన్నియును గూడ వర్ణనాత్మకములుగా మనకు కన్నులు యెదుట చూపబడినట్లుగానే అవి యొక రూపసృష్టిని యొనర్చినట్లుగా రసరంజిత హృదయులైనట్టి వారికి కనుబడుచుండుట యథార్థమేయగును. అట్టి యా సన్నివేశ సందర్భ విశేషములు గలిగినట్టి పద రచనలను అవి పచ్చి శృంగారములు అనిన్నీ – ఇట్లీ రీతిగా వర్ణించుట కొంత విచారకరమైనట్టి విషయమేనని చాలామంది యొక్క అభిప్రాయములలో నుండుట యథార్థమేయగును. అయితే మనము ఇప్పుదు ముందుగా అసలు శృంగారము అనగానేమియో, కొంత విమర్శించి తెలిసికొనవలసియున్నది. అసలు శృంగారము అంటేనే పచ్చిదిగా చెప్పబడుతూ ఉన్నది. అట్టి యా శృంగారమును రసవత్తరముగా రూపొందించి చూపుటలోనిదియే (ఈ క్షేత్రయ్య గారిదే) మార్గముగా మనకు తెలుస్తోంది. మనము బాగుగా విచారించి తెలుసుకొన్నట్లయితే ఇంతకంటెనూ వేరొక మార్గము లేదనే మనము ఖండితముగా చెప్పవచ్చును. ఎందువల్లనంటే; మనపూర్వులు అనేకమంది సంస్కృత కవులున్నూ తెలుగు కవులున్నూ కూడా ఇట్టి యీ శృంగార రసాత్మకములైనట్టి సన్నివేశములను ఏ మాత్రము కూడా సంశయము లేకుండానే ఈ శృంగార రసాన్ని మిక్కిలి గానే ఎక్కువ పాలుగానే రూపొందించి, ఆయా రసవత్తర సన్నివేశములను గొప్పగా అభివర్ణించియుండిరి. ఆయా సంస్కృత కవులూ తెలుగు కవులూ అందరున్నూ గూడ దేవతల రతి విశేషములను గురించి దేవనాగరి భాషయగునట్టి సంస్కృత మందున సాంగముగానే విమర్శిస్తూ వారంతా వర్ణిస్తే అట్టి యా వర్ణనా విశేషముల యందుననే ద్విధమయినట్టి అనౌచిత్యముగానీ అసభ్యతగానీ జుగుప్సాకరముగానీ కలిగి యుండలేదు. మరిన్నీ ఆ విధమయినట్టి రతి విశేషములనేగాకుండా కేవలమున్నూ దైవ ప్రార్థనా విధానమునందు గూడనూ ఉన్నతములయినట్టి అంగప్రత్యంగోపాలుగ సౌష్ఠవాది విశేషములను యథాతథముగా సంస్కృత భాషలో వర్ణించియుండినప్పటికిన్నీ ఎట్టి యసభ్యతగానీ జుగుప్సగానీ కలిగి యుండలేదు. ఇందుకు ఉదాహరణముగా; "ప్రత్యున్నతకుచ" యనీ, "ఉన్నతస్తనం" అనీ, ఇంకా కూడా "మత్తేభ (మదగజ) కుంభకుచ (స్త్రీనీ)యనిన్నీ, "ఉత్తుంగజఘనం" అనీ ఇట్లే అనేక రీతులుగా అభివర్ణించి యుంటే అందు తప్పు ఏమియునులేదు. మరియునూ ప్రార్థనా విధానంలో పరమ భక్తాగ్రేసరుడైనట్టి రామదాసు (గోపన్న) తనను రక్షించమని శ్రీరామునితో చెప్పమని సీతాదేవిని వేడుకొంటాడు. "నను బ్రోవమని చెప్పవే సీతమ్మా!" అనే కీర్తనయందున ఆ కీర్తనలో "లోకాంతరంగుడు,, శ్రీకాంతనినుగూడి, ఏకాంతముననేక శయ్యనుండెటివేళ ననుబ్రోవమని చెప్పవే సీతమ్మా" అంటాను. అంతటితోనే ఆగలేదు. ఇంకనూ "ప్రక్కను జేరుక చెక్కిలినొక్కుచు చక్కగా మరుకేళి సల్పుచుండెవేళ – నను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లీ!" అంటూ వేడుకొంటాడు. ప్రార్థిస్తాడు. ఇట్టి యుదాహరణములు అనేకములుండియున్నవి. అట్టివి

అన్నియును గూడ భక్తుడు తన యొక్క భక్తావేశంలో శృంగార రసోద్భూతములుగా వర్ణిస్తూ చెప్పియున్నట్టి యున్నత విశేషములే కాని అవి అనుచితములు కానేరవుగదా? కనుకను అట్టి యా వర్ణనలు అన్నియును అత్యంత రమణీయముగాను ఉత్సాహోత్కర్షా జనకములుగా నున్నూ, మనోరంజితములుగాను రూపొందింపబడి యుండినవి. ఇది వ్రాయ శాస్త్ర, భౌతిక, ఆధ్యాత్మిక సంపన్నతకు ఆధారముగా నుండి యుండవచ్చును. అవినీతికరము, జుగుప్సాకరము అంటే; అది కేవలము లౌకికమున్నూ, మనోరంజితమయినట్టిది. అయితే ఆలౌకిక మున్నూ అవుతూవున్నది. వీటిలోనొక్కటి కామితము అయినట్టిదిన్నీ, మరియొకటి (రెండవది) నిష్కామితమయినట్టిదిన్నీ కాగల్గుచున్నవి. ఇట్టి యీ రెండింటిలోనున్నూ కామితము అయినట్లయితే అది ప్రేమయున్నూ, అది నిష్కామితము అయినట్లయితే అట్టిదే మధురభక్తి యనిన్నీ చెప్పబడుతూ ఉన్నది. ఇట్టి యీ విధానాన్నే పండితోత్తములు జీవాత్మ – పరమాత్మల యొక్క సంధాన విధాన క్రమము అనిన్నీ అన్నారు. ఏదియైనను విషయ గ్రహణ మనో విధానమున్నూ తత్వమును బట్టిన్నీ సంభావన జేయుట జరుగుతుంది. సరే – అయితే ఇప్పుడు యీనాటి ఆధునిక విమర్శకాగ్రేసరులు అందరున్నూ ప్రతిదానినిన్నీ – బూతు అనిన్నీ, అంతా కూడా అసభ్యమే యనిన్నీ. అతి తీవ్రంగా విమర్శిస్తూ ఉంటారు. వారికి, వారి వారి దృష్టిలోనున్నూ అనుభవములోనున్నూ కనుబడునట్టిది అంతా అదియేగనుక. వారికి దృష్టి అంత పైకి ప్రసరింపదు. స్వర్గాధిపతియైనట్టి ఆ దేవేంద్రుణ్ణి గౌతముడు శపిస్తాడు. "సహస్ర భగుడవు గమ్మని". ఆ రీతిగానే జరుగుతుంది. అట్టి దాని యొక్క అనంతర పరిణామంలో ఇతరులకు నేత్రుడుగా (అవి అన్నీ సహస్ర నేత్రములుగా) కన్పిస్తూ వుంటవనిన్నీ, అతనికి (ఇంద్రునికి మాత్రం) అతని యొక్క మనోదృష్టిలోనుండి యున్నట్టి కామితమును బట్టి అవి అన్నియునూ దేహము అంతేదినున్నూ మరొక విధముగా అనేకములైనట్టి (భగ) రూపములుగా ఎల్లప్పుడు అతనికి కనబడుతూ ఉండేటట్లుగా అనుగ్రహిస్తాడు గౌతమముని. అట్లే జరుగుతుంది. ఇప్పటికిన్నీ ఆ విషయముప్రతీతియే గదా? కనుకను ఎవరిదృష్టిలో నున్నట్టిదే వారికి కనుపడుతూ ఉంటుంది. కనుక ఇట్టి వీరందరికిన్నీ కనుపడునట్టిదంతా "బూతు" అవుతూ ఉంటుంది. ఇట్టి వారందరున్నూ అసలు ఈ జీవితము ఉత్పత్తి క్రమముగా, ఆ విధానము ఎట్టిదో ఆలోచించి తెలుసుకొన్నట్లయితే అప్పుడు వారికి అసలు యథార్ధ తత్త్వము ఎట్టిదియో బాగుపడుతుంది. కనుక అప్పుడు ఆ దృష్టితో అంతయున్నూ కేవలం బూతుమయంగానే కనబడుతుంది. నిజంగా ఆలోచిస్తే ఆ బూతు అనునదియే లేకపోతే ఈ ప్రపంచము అంతయును గూడ మిధ్యయే గదా? ఈ యావత్తు ప్రపంచములోనున్నూ అయోనిజమయి నట్టి (యోనిజనితము కానట్టి) జీవియే లేదనెడి విషయము స్పష్టమేగదా? కనుకను ఇది యదార్ధమయినట్టి మూలతత్త్వము.

మానవుని మానసికములైనట్టి సవ్యాపసవ్య విశేషము లన్నియును గూడ కాలమునుబట్టి యుండగలవని మనము తలంపవచ్చును. ఏమంటే ఒకప్పుడు వర్తిల్లియుండినట్టి న్యాయ, ధర్మ, సత్య, అహింసయును, నీతియు ఈ మొదలైనట్టివన్నియును గూడ మరొక్కడు అప్పటి ఆకాల ప్రభావ విశేషముచేతను అవియే కొన్నికొన్ని తారుమారై వ్యతిరేకముగా పరిణమించవచ్చుకూడను. కనుక అట్టి యా రీతిగనే సాహిత్య బ్రహ్మ స్రష్టలగునట్టి వారి యొక్క సంభావనా విశేషములు గూడను కొన్ని కొన్ని అప్పటి కాలాన్ని అనుసరించియే యుండవచ్చును అని మనము ఊహించవచ్చును.

సామాన్యముగా మనము అందరముకూడను అత్యంతంగా తాపత్రయపడుతూ ఉండేది ఏమంటే ఒకానొక మహాకవి అత్యంతర సాత్వికమగునట్ట తన కావ్యమునందలి నగ్న వర్ణనా విశేషములను దేవతా పరముగానున్నూ ప్రార్ధనాపూర్వకముగా నున్నూ రచించుకొని గానమొనర్చుచూ, అట్టి దానినే మననము చేస్తూ తాను తరించవలెననియే గదా? ఉత్సాహపడుతూ ఉండడము? అట్లే ఒకానొక మహాశిల్పి (స్థపతి) ఒక నల్లనైనట్టి బండశిల (బండరాతిలో) అతి నగ్నముగానున్నూ అత్యంత సుందరముగానున్నూ తన యొక్క ఉలితోచెక్కి (మలిచి) అందు ఒకసుందర స్వరూపముగల యొక సౌందర్యమూర్తిని సృష్టించినచో నట్టి యా సుందరతర మూర్తిని సమస్త ఉపచారాదికముతోనున్నూ పూజించి, ఆ దివ్యసుందరమూర్తిని ఆరాధించి, మన ఆత్మ సంతృప్తిని పొందుచున్నాము. అందున నెట్టి విధమయినట్టి దోషము గానీ జుగుప్సాకరమయినట్టి విషయముగానీ, అసభ్యతగానీ లేదుగదా? ఇట్టి దానికి

అంతటికిన్నీ ముఖ్యకారణము ఏమంటే మన యొక్క హృదయ సంస్కారమే యగును. కనుకను అట్టి ఆ తీరుగా హృదయ సంస్కారము లేనట్టివారు ఒక యుత్తమ కళాతపస్విగా కాజాలరు. ఇది అసలు యదార్థమయినట్టి విషయము.

ఒకానొక ఉత్తమ కళా స్రష్ట (బ్రహ్మ) యగునతడు కళోపాసనద్వారా గంటము (తాటి యాకులపై వ్రాసెడి లేఖని) నుండిగానీ, కంఠము (గాత్రము) నుండి గానీ, ఉలినుండి గానీ ( రాతిని చెక్కెడి ఇనుప పోగర) యొక జుగుప్సాకరమయి నట్టిగానీ లేక అసభ్యకరమయినట్టి గానీ సౌందర్య విశేషమును (కవిత్వము, పాట లేక సాహిత్యము శిల్పి ప్రతిమ) రూపొందింపడు గదా? కనుకను ఇట్టి యీ సంస్కారాత్మకమయినట్టిదగు దీర్ఘ దృష్టితో పరికించినట్లయితే ఈ ప్రపంచమంతటిలో నున్నూ అట్టి విషయమునకు తావేలేదు. అందు వల్లను ఏదియోనొక సాధనా విశేషముతోగానీ, ఒకానొక రూప విశేషముతోగానీ, ఈ మానవుని యొక్క అంతరంగము (అంతర్బుద్ధి) ఊర్ధ్వగతము కావలసి యుంటుంది. అంటే జీవాత్మ యనునది పరమాత్మమందున ఐక్యతను జెందవలసియుండును. అట్టి ఆ రీతిగా జీవాత్మ – పరమాత్మల యొక్క ఐక్యతకు మాత్రమే ఈ సాధనా సంపత్తి యావత్తున్నూ. అట్టి జీవాత్మ – పరమాత్మల ఐక్యతనే అద్వైత సిద్ధియని పెద్దలు పేర్కొని యున్నారు. రసజ్ఞ హృదయులు కొందరు ఒక్క శృంగారము మాత్రము ముఖ్య రసముగా చెప్పియున్నారు. మరికొందరు సర్వ రసములున్నూ నవరసములు ఆ శృంగార రసమునందలి వేనని చెప్పియున్నారు. పైనను చెప్పబడినట్టి వారిలో మన క్షేత్రయ్య కూడా ఆ విధమగునట్టి దృష్టిగల వాడే అయియున్నాడు. అందువల్లనే అత్యంత రసాత్మకమయినట్టి పదజాలములు గలిగనట్టివగు వాక్యములతో ఒకే ఒక శృంగారాన్ని మాత్రమే ప్రాధాన్యముగా గ్రహించి, అతడు తన యొక్క పదరచనలను రూపొందించియుండెను. కనుకను ఇట్టి యీ క్షేత్రయ్య నిష్కాముడేయగును. నిస్సందేహంగానే అతడు నిష్కాముడే యగును. అతనికి ఎట్టి ఐహిక వాంఛలుగానీ తదితరములగునట్టి విషయ వాంఛలుగానీ లేనేలేవు. అతడు అలౌకిక దృష్టితో కేవలమున్నూ శృంగార రసావేశంలో మునుగుతూ తేలుతూ తన నిశ్చల మానసిక ప్రేమతో ననేకములైనట్టి మధురాతిమధురములైనట్టి సన్నివేశములను అతడు సంభావించి, ఇట్టి మధుర భక్తిపూర్వమైనట్టి తన యొక్క పదరచనలను గానం చేశాడు. ఆనందాన్ని పొంద గలిగినాడు. ఇట్టి యీ రీతి గల్గినట్టి యీతని మధురభక్తిని మన మెవ్వరమున్నూ కాదనజాలము గదా! అట్లయినప్పుడు పరస్పరాపేక్షణీయమగు నట్టి ఐక్యతను చేపట్టునట్టి వివిధ క్రియావిశేషములే లౌకికము అగునట్టి ఈ ఇహలోక వ్యవహారము అంతయున్నూ, కనుకను క్షేత్రయ్యగారి పదరచనలన్నియును గూడ నిసర్గ మధురములు అగుచున్నవి. మనము క్షేత్రయ్యగారి యొక్క సుశిక్షత మగునట్టిదగు భావనా సౌందర్య విలసితమగు సాహిత్యములనుండి రూపొంది యుండినట్టిదగు నాట్యకళా సంపద రక్తి నిజమయినట్టిది. అది నిశితమయినట్టినది యగును

క్షేత్రయ్యగారి యొక్క ప్రేమ సంభావనా విశేషము అతిగా ఘాటు అయినట్టిదిన్నీ. ఆయన యొక్క అతి నిర్మలమగునట్టి హృదయమునుండి రూపొందియున్నట్టిదగు యుద్విగ్న ప్రేమజ్వాల నేరుగానే యాతడు రూపొందించి యుండినట్టిదగు ఆత్మను చేరినదై గాఢ పరిష్వంగ మొనర్చి శాశ్వతానందమును పొందునట్లుగా చేయగలిగింది. ఏ విధమయినట్టి అరమరికలు గానిలేనట్టి స్నేహ సౌందర్యమునున్నూ, సౌలభ్యమునున్నూ ఒనర్పజేయ గలిగినట్టి సౌకుమార్య విశేషములు ఆయన యొక్క పదరచనారీతులు. ఈ క్షేత్రజ్ఞుని యొక్క పదరచనలయందలి ప్రేమ స్వభావము నిసర్గమధురమయినట్టిది. అది కేవలమున్నూ వ్యవసాయాత్మకము కాదు. ఎందువల్లనంటే; అందున "ఫలాపేక్ష" యనునదియే లేదు. ఇట్టి యీ ప్రేమకలాపము నియమిత వ్యాపారము కాదు. నిసర్గ ప్రేమయనునది స్వసుఖాభిలాష కాజాలదు. దీనికి ప్రణయ భాజనము అగునట్టిదగు వ్యక్తి సుఖమే పరమ ఆపేక్షణీయమయినది. అట్టి దానియందున నెట్టి విధమగునట్టి అసభ్యత గానీ, జుగుప్స గానీ (ఉండుటకు) ఎంచుటకు అవకాశమే లేదు గదా! అట్టి యీ రీతి గలదియగు నాతని యొక్క సన్నివేశ సంఘటితమయినట్టిదగు పదసాహిత్యాన్ని మనము మనయొక్క ఉపాధిని అనుసరించి, వేరు వేరుగా భావన చేస్తూ ఉన్నాము కనుకను ఆ మూలము గానే ఈనాటి యీ విమర్శలు అన్నీ కూడా ఉత్పన్నములు అగుచున్నవి. యథార్థము సత్యమున్నూ ఒక్కటియే. అట్టి యీ సత్యాన్నే తెలివిగలవారు పండితులైనట్టివారు దానిని వారి చిత్తమునకు నచ్చినట్టి తీరుగా కాని, ఎవ్వరు ఎట్లెట్లుగా ఏ తీరుగా చెప్పినప్పటికిన్నీ

యథార్థమయినట్టి దాని యందున నెట్టి విధమగునట్టి మార్పుగానీ యుండదుగదా! సత్యము నిత్యమేయగును.

పూర్వము నుండిన్నీ చాలాకాలముగానే మన ఋషీశ్వరులు, యోగులు, మౌనివర్యులు మొదలయినట్టి వారందరున్నూ ఈ శృంగార రసాన్ని అత్యంతము పవిత్రమయినట్టి దానినిగా భావించి యున్నారు. మానవునకు గల బ్రహ్మచర్య, గార్హస్థ, వానప్రస్థ, సన్యాసములే చతుర్విధ ఆశ్రమములలో నున్నూ గార్హస్థ, ఆశ్రమమే గొప్పదిగా భావించియుండిరి. అందువల్లను ఆ గృహస్థ ఆశ్రమమునకు మిక్కిలిగా ప్రాధాన్యతనున్నూ, అత్యంత గౌరవమున్నూ చూపించియున్నారు. అనుశ్రుతముగాను సంప్రదాయంగానున్నూ "కామిగాక మోక్షగామికాజాలడు - అన్నమాట సత్యము. నివృత్తి మార్గమునకు ముందుగా ప్రవృత్తి మార్గమే సుగమము అయినట్టిదిగదా? కనుకను గార్హస్థ, ధర్మమునందున గృహస్థుడు కామము, ప్రేమములనెడివాటికి అతీతుడుగా నుండుట అసంభవమే గదా? అట్టిది సహజ విరుద్ధము. అందువల్లను కాముక ప్రేమయయనుది నాయికా నాయకుల యొక్క అధీనమైనది. వారి యొక్క నివృత్తికిని అయిక్యతకున్నూ ఈ శృంగారము ఆలంబనము అగుచున్నది. కనుకను మధుర ప్రేమయనునది ఇట్టి సుఖాన్నే ఆపేక్షిస్తూ ఉంటుంది. అది ఎంతయును సహజమున్నూ నైజమున్నూ అగును. ప్రేమావేశమువల్లను ఆత్మ వికాసమును బొందినట్టదియై అది ఆనంద గ్రథితము కాగలుగుతూ ఉన్నది. క్రమంగా అనురాగము ప్రబలమయినకొద్దిన్నీ అస్తిత్వము తగ్గపోతూ ఉంటుంది. సహజంగానే ప్రేమమయుదున్నూ ప్రేమాస్పదుదున్నూ అయినట్టి తన మానసిక ఆరాధనా మూర్తిని అమిత గాఢముగా ప్రేమించుటలో మానవుని యొక్క మానసము లేక ఆత్మ విస్తృతిని పొందినట్టిదై తన యొక్క మానసిక ఆరాధనా మూర్తితో ఐక్యతను జెందగల్గుతుంది. ప్రేమికుడైనట్టి వ్యక్తి ఆత్మోత్సర్గముతో నెఱపునట్టిదియగు ప్రేమ భక్తియే భగవద్భక్తికి మూలకారణము అవుతుంది. దానికి అదియే ప్రథమ సోపానము (మెట్టు) వంటిది కాగలుగుతుంది. ఆ భగవానునే తన మనస్సునందున తనకు పతిగా భావించి నిలిపి, ఆ భగవంతునే ప్రణయ భాజనునిగా సేవింపుచూ తమ అనురాగము అంతయును ఆ భగవానుని యందుననే నిక్షిప్తము నొనర్చి, సంభావనా ఆరాధనా క్రమవిధానంలో చిత్తవృత్తిని నిరోధించినట్టి స్థితి లభ్యము అగునటువంటి పరిస్థితిలో ఇతరములైనట్టి బాహ్యా విషయాదులకు గానీ. అటువంటి అనిర్వచనీయమగునట్టి ఆనందమునందున తావు లేనేలేదు. అటువంటి తీరుగా అహంకార రహితమయినట్టిదగు మహదానందానుభవమే ఈ విశ్వ సృష్టి యొక్క మనుగడుకున్నూ, ప్రేమ వికాసమునకున్నూ ఒక దివ్య జ్యోతివంటిదిగా నగుచున్నది. అనురాగము కవితగానూ గానము గానూ కర్ణపేయము అయినటువంటిదై, అదియే ఆత్మపేయమును గూడను అయి, అమృతముగా అయినప్పుడు అత్యంత రసోపేతమైనట్టిదై, అదియే ఆత్మపేయమును గూడను అయి, అమృతముగా అయినప్పుడు అత్యంత రసోపేతమైనట్టిదై, తన్మయత్వమును గలిగించి ఆనంద తాండవము నొనరింపజేయును. అటువంటి సందర్భమునందును, ఈ సౌందర్యము నగ్నముగానున్నూ అతి విశ్వంబలముగానున్నూ నాట్యం చేస్తుంది. ఇదియే ఈ విశ్వ సృష్టియందలి రహస్యమున్నూ, అదియే పరమ సత్యమున్నూ అయి వున్నది.


**"ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయచ"** అని పెద్దలు ఒక సత్యాన్ని చెప్పియున్నారు. అంటే; తనకు మోక్షముకొఱకై ఈ సర్వ జగత్తుకున్నూ హితమునే ఆకాంక్షించినప్పుడు మోక్షప్రాప్తి అతి సుగమము అవుతుంది అని పెద్దలయొక్క నుడి కనుకను ఇటువంటి తీరుగా సాగిపోతూ ఉంటేనే సంసారిక వ్యవహారము అత్యంత సౌందర్యాన్వితముగానూ, ఆత్మానంద భాజనంగానున్నూ ఉంటుంది. మన క్షేత్రయ్యగారి కవిత్వమునందున నిర్భయత్వము, నిస్సంగత్వము, నిష్కామత్వము, ఈ మూడున్నూ ద్యోతకము అవుతూవుంటవి. ఈయన రచనలలో త్రికరణశుద్ధి యైనటువంటిదగు ఆత్మ నిశ్చలత్వము మనకు సర్వే సర్వత్రాదృశ్యమౌతూ ఉంటుంది. అట్టి యీ విలక్షణా విశేషములు కేవలమున్నూ విశ్వ కళ్యాణ ఆవేదిక్షలగు నటువంటి కళాస్రష్టల (బ్రహ్మల) యందున మాత్రమే నిక్షిప్తమైయుండడము ప్రత్యేకముగా గమనింపనింపదగినట్టి విషయము.

ఈ క్షేత్రయ్య అనిర్వాచ్యమును, అలౌకికమునూ అమానుషత్వ నిరూపకమున్నూ స్నిగ్ధభావ రూప విలసితమున్నూ అగునటువంటి రసానుభూతిని అందచేయగలిగిటువంటి కళా సంస్కృతిని సంపూర్ణముగా పొందగలిగియుండినటువంటి భావ సంస్కారులలో నొక్కడు అని చెప్పదగును.

ఈ క్షేత్రజ్ఞుని పదములలోనిదగు రసభావ సౌందర్య విశేషమునకు ప్రతి హృదయాన్ని కూడా ఆకర్షించి ఆనంద తాండవము చేయించగలుగునటువంటి శక్తి సంపూర్ణముగానుండి యున్నది. ఈతని యొక్క పదరచనలను వినిననూ, వాటిని పరిశీలనాత్మక దృష్టితో చూచిననూ, ఏదియో నొకవిధమయినటువంటి అనిర్వచనీయమయినటువంటి రసానుభూతి కలుగుతుంది. తప్ప కుండాను. ఇదీ యీ పదులందున గల సత్యము.

ఈ క్షేత్రయ్య పదములయందలి విన్నాణము ఎనలేనటువంటిది అనిన్నీ అక్షీణమయినటువంటి కీర్తిని సంపాదించుకొని వన్నెయును వాసియును గాంచినది. ఇటువంటి యీ పదములన్నియును నాట్యమునకు ఎంతయో రమణీయమయినటువంటి శోభను సమకూర్చుచున్నవి. అభినయమున కెంతయును ఈ పదములు ప్రాముఖ్యములుగా నుండి యున్నవి. గనుక మన తెలుగు దేశమునందలి నృత్యవిధానములో నీ పదాభినయము అత్యంత ప్రాధాన్యమై నట్టిదియును అతి విలువగలిగినట్టిదియును అయి విరాజిల్లుతూ నున్నది. ఇటువంటి యీ పదకవితా చమత్కృతి సాహిత్యమునకు ఉచిత మయినటువంటి రీతిని రసాస్వాదనమును కలుగ జేయటమాత్రమే గాకను, సంగీత కళా వికాసమునకు ఎంతయో నుపయోగకరమయి యున్నది. నృత్య రీతులయందలిదగు సాత్వికాభినయమునకు అనివద్యమగునటువంటి భావ సామాగ్రిని అందింపచేసియున్నది. ఈ క్షేత్రయ్య గారి యొక్క సౌకుమార్యములగునటువంటి పద, రస భావసంభావనము అత్యంత ఉజ్వలమైనటువంటిదియును దివ్యమైనటువంటిదిన్నీ అటువంటి యీ కారణముగా నాతడు అక్షీణమయినటువంటి కీర్తిని ప్రతిష్టనున్నూ సంపాదించుకొన్నటువంటి గొప్ప ప్రతిభాశాలియునూ కళాశీలియునూ కాగలిగినాడు. ఆయన పదములు అమరత్వమును పొందగల్గినవి. మరియును ఈయన యొక్క పదములు అన్నియునూ అలంకార శాస్త్రమునకు లక్ష్యములుగా రూపొందింపబడియున్నవి. క్షేత్రయ్యగారు గొప్ప అలంకారికుడుకూడను.

క్షేత్రయ్యగారి పదములలో ఆత్మార్పణముగా అద్వైత స్థితిని పొంది ఆలాపించినటువంటివగు ఆ పదములు ఆయన యొక్క మధుర భక్తికి సరియైనటువంటి యుదాహరణములు కాగలిగియున్నవి. తెలుగు సాహిత్యంలో పద కవితా సమ్రాట్ మన క్షేత్రయ్య!



# ఇతరుల కష్టము ఎవ్వడెరుగునో అతడే వైష్ణవుడు మహాత్మాగాంధీ



**– మల్లాది సూరిబాబు**

పండుగలు, పర్వదినాలూ ఇతర దేశాల్లో కంటే మనకే ఎక్కువ.

వినాయక చవితి అనగానే గణేశ విగ్రహాల నిమజ్జనం... అదో పెద్ద తతంగం, సంబరం కూడా. అమ్మవారి శరన్నవరాత్రులు సరేసరి. శ్రీరామ నవమి ఉత్సవాలూ, యిలా ఒకదాని వెంట మరోటి వరుసగా వస్తూ భక్తి భావాన్ని, కొన్ని రోజులపాటు ప్రబోధిస్తూ వచ్చి వెళ్ళిపోతూంటాయి. మాతృభూమిని తలుచుకుంటూ, ఒకవైపు బానిసత్వపు సంకెళ్లను ఛేదిస్తూనే, మరోవైపు ఆ బానిసత్వానికి బలవ్వడానికి జాతి లోని ఏయే పాపాచరణలు కారణమో గ్రహించి, వాటి నుంచి, జాతికి విమోచనం కలిగించడానికి దీక్షతో పనిచేసిన 'జాతిపిత'ను మాత్రం ఏ జయంతికో వర్ధంతికో తలచుకుని ఊరుకుంటాం. అంతే. మళ్ళీ ఏ ఏడాదికో గాని, ఆయన గుర్తుకు రాడు. గాంధీ జీవితం చూడండి.

తెల్లజాతిని తరిమికొట్టడానికెంత ప్రయత్నించాడో – హరిజనోద్ధరణ కూడా అంతగానూ ప్రయత్నించాడు. పైగా ఈ రెండు ప్రయత్నాలూ ఏకకాలంలో నిర్వహించిన ఘనుడు.

ఆయన అందుకున్న గీతా సందేశమే ఆయన్ని అంతటి స్థితిలో నిలబెట్టి అంతటి బృహత్తరమైన కార్యాన్ని నిర్వహింపచేసింది.

భారతదేశ స్వాతంత్ర్య సమరానికి ముందుకూడా ఎందరో హేమాహేమీలైన నాయకులున్నారు. లేకపోలేదు. దానిక్కారణం ఆయన రూపమూ కాదు. తెలివితేటలూ, సామర్థమూ కాదు. 'జీవితాన్ని తీర్చిదిద్దుకోవడంలో ఆయన చూపించిన 'దీక్ష' – పట్టుదల, క్రమశిక్షణ. ఆ స్పష్టమైన కర్తవ్యం తెలిసికున్న పూర్ణ పురుషుడు గాంధీ.' అన్నారు. అన్ని సంప్రదాయాలను గౌరవించాడు. సకల సిద్ధాతంతాలనూ అధ్యయనం చేశాడు. రెండడుగులు ముందుకేస్తే పదడుగులు వెనక్కి లాగే మనస్తత్వం కలిగిన వాళ్ళందర్నీ ఏకతాటి మీద నడిపించాడు. ఔనా? కాదా? త్రికరణ శుద్ధిగా మనిషి సంకల్పిస్తే ఎటువంటి మహత్తర కార్యాలు చేయవచ్చునో నిరూపించి చూపించాడు. మహాత్ముడై గౌరవింపబడుతూ జాతికి చిరస్మరణీయుడయ్యాడు. ఆయన మాటే వేదవాక్కై జాతిని నడిపించింది.

హరికథలలోనూ, ఎప్పుడో ప్రత్యేక సందర్భాల్లో, జాతీయ పండుగ దినాల్లో మా నాన్నగారు పాడుతూండే పద్యమిది.

**ఎవ్వాడు నవ్విన నివ్వసుంధర యెల్ల జలధర శ్యామమై చలువలీను**
**ఎవ్వాని క్రోధాగ్నికే, దువారాసులు పాయలై భూమి గర్భమున నింకు**
**ఎవ్వాని నిద్రకు వీక్షోణి మర్త్యాళి ప్రళయకాలపు భంగి కళవళించు**
**ఎవని సిద్ధాంతముల్ హృద్యమై వంద్యమై ఆచంద్ర తారార్కమై వెలుంగు**
**ఎవ్వడభినవ బుద్ధుడై నివ్వటిల్లి విమల సత్యాగ్రహ వ్రతంబు వెలయజేసి**
**మానవాళికి నొరవడై మనుచుచుండె అట్టి గాంధిని స్మరియింపు మాంధ్రుడనీవు.**

యిది జాషువా రాసిన పద్యం.

ఒక మనిషి సంకల్పం సమాజానికి దిక్సూచి అవుతుంది. అటువంటి ప్రతిభామూర్తులలో జాతిపిత గాంధీ నిత్య స్మరణీయుడు.

ఆయనంటే నచ్చనివారు, ఆయన సిద్ధాంతాలతో విభేదించిన వారు, నచ్చినవారు ఆయనకు శిరస్సు వంచి నమస్కరించారు. కేవలం కండువా, అంగవస్త్రంతో ప్రపంచాన్ని చుట్టిన ఆ వ్యక్తి ఆత్మస్థైర్యం ఎంతటిదో చూడండి.

మనోవాక్కాయ శుద్ధితో చేసే పనులకు దైవం సహకరించకుండా ఉంటాడా? యిటువంటి పదిమందినీ ఒక్కతాటిపై నడిపించే నాయకులు భూతద్దం పెట్టి వెదికినా ఈ వేళ కనిపించరు. సంగీత ప్రియుడౌనో కాదో తెలియదు కానీ మహాత్ముడికి... వైష్ణవ జనతో... రఘుపతి రాఘవ రాజారం... వంటి భజనలు ఎంతో యిష్టం.

'భారతరత్న' ఎం.ఎస్.సుబ్బులక్ష్మి చేత పాడించుకుని వినేవాడు. నా అనుభవంలో... ప్రతి శుక్రవారాల్లో ఉదయం విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుండి ప్రసారమయ్యే 'గాంధీమార్గం' కార్యక్రమం ఎంత మంది శ్రోతలు వినేవారో నాకు తెలియదు గానీ నేను పని చేసే కాలంలో మాత్రం గాంధీ

జయంతి రోజునో వర్ధంతికో మాత్రం ఈ భజన్‌లు ప్రసారమయ్యేవి. గాంధీ ఆత్మకథకు తెలుగు అనువాదం పుస్తకంతోబాటు జుతీకారాయ్, లతా పాడిన భజన్ రికార్డులు ప్రసార కక్ష్య (స్టూడియో)కు పంపిస్తూండేవారు. ఈ కార్యక్రమం ఎవరు వింటారులే? అనుకుంటూ మొక్కుబడిగా చదివే కొందరు ఎనౌన్సర్లుండేవారు. శ్రద్ధగా మనసుపెట్టి నిర్వహించేవారుకూడా ఉండేవారు. కదలకుండా స్టూడియోలో కూర్చుని ప్రసారం చేసే ఉద్యోగమవడం వల్ల 'గాంధీ మార్గం' కార్యక్రమం అప్పటికప్పుడు 'లైవ్' చదివేవాణ్ణి. నాకు మాత్రం 'మహాత్ముడి ఆత్మకథ (సత్యశోధన) నుండి చదివే కొన్ని అధ్యాయాలు ఒక్కోసారి ఆలోచింపచేస్తూండేవి. ఆశ్చర్యం గొలిపేవి కూడా.

ఒక సూర్యుడు మొత్తం లోకాన్ని వెలుగుతో నింపేసినట్లు. ఎక్కడో పోర్‌బందరులో పుట్టిన ఓ సామాన్యమైన వ్యక్తి, బారిష్టరై నాలుగు చేతుల్తో పుష్కలంగా సంపాదించగలిగీ కూడా ఏమిటో నేను, నా దేశం, నా ప్రజలనుకుంటూ స్వతంత్ర సమర శంఖారావాన్ని పూరిస్తూ కార్యసాధనోన్ముఖుడై ఈ జాతిని ఒక్క తాటిపై నడిపించగలగడం... అదేమన్నా సామాన్య విషయమా? చెప్పండి. ఆయన నరనరాల్లో దేశభక్తి ఎలా జీర్ణించుకు పోయిందో, ఆయన జీవిత ఘట్టాలు చదువుతున్నప్పుడు తెలిసేది. ఆ రోజంతా అవే మనసులో తిరుగాడుతుండేవి.

'వైష్ణవ జనతో' అనే హిందూ భజన 15వ శతాబ్దంలోని గుజరాతీ భాషలో నర్సీ మెహతా రాశాడు.

శబర్‌మతీ ఆశ్రమంలో చేసే నిత్య ప్రార్థనలో, ఈ భజన ఉండేది. 1999లో గంగూభాయ్ హంగల్, పండిట్‌జస్‌రాజ్, పాప్ స్టార్ రెమో ఫెర్నాండేజ్, సరోద్ విద్వాంసుడు అంజాదాలీ ఖాన్, హరిప్రసాద్ చౌరాసియా, శివకుమార్ శర్మ (సంతూర్ వాద్య కళాకారుడు) మొదలైన కళాకారులు ఈ భజన్ ని బహుళ ప్రచారం చేశారు. 'వైష్ణవ జనతో తేనేకహియే' భజన్, ఒక మళయాళం సినిమా కోసం ప్రసిద్ధ గాయని బొంబే జయశ్రీ 'పల్లవి' మాత్రం పాడింది.

'హరి తుమ్ హరో' మరో ప్రసిద్ధమైన మీరా భజన్ కూడా మహాత్ముడి కిష్టమైనదే. 'మీరా' సినిమాలో సుబ్బులక్ష్మి పాడింది. మీలో కొందరు చూసే ఉంటారు. నామ రామాయణానికి లక్ష్మణాచార్య చేసిన అనువాద రచనే 'రఘుపతి రాఘవ రాజారాం'

ఒక మంచి భావన మనిషిని ఎంత ఉద్ధరిస్తుందో ఎంతటి ధన్యతను అందిస్తుందో మహాత్మగాంధీ జీవితాన్ని చదివితే అర్థమౌతుందనిపిస్తుంది నాకు. త్యాగంలో గొప్పతనం, ఔన్నత్యం, హుందాతనం, నిర్భరత్వం గుర్తించటం తెలియకపోవటం వల్ల, సంకుచిత భావాలు మితిమీరటంలా? త్యాగ భావంతో బ్రతికిన నాడు ఎవరైనా, జీవన్ముక్తుడౌతానడడానికి సాక్షి గాంధీ. డా. పుట్టపర్తి నారాయణాచార్యులు 'వైష్ణవ జనతో' భజనకు తెలుగు సేత చేశారు. సాహిత్యాన్ని పరిశీలించండి. సరళంగా ఉండి, భావంతో నిండిన ఈ పాట చూడండి.

**ప. ఇతరుల కష్టము ఎవ్వడెరుగునో అతడే వైష్ణవుడు**

**అ.ప. సతతము పరులకు సాయము చేయుచు**
**గతి తానేయని గర్వము పడడో ॥ఇ॥**

**చ. సకల లోకముల సన్నుతి సేయుచు అపనిందలచే**
**అపచారము చేయడొ...**
**మనసున వాక్కున నిశ్చలుడెవ్వడొ**
**యోగ్యురాలతని కన్న జననియే ॥ఇ॥**

**చ. సర్వము సమముగ నెవ్వడెంచునో**
**ఆశవీడి పరస్త్రీ మాతగ జూచునో**
**నాలుక వ్రీలిన అసత్యము పల్కడొ**
**పరధనములకై ప్రాకులాడడో ॥ఇ॥**

**మోహము మాయయు మనమునుండవో**
**గృహ వైరాగ్యము ధృవముగా కుదురునో**
**రామనామమున ధీరుడై పోవునో**
**రాజిల్లు వానిలో సకల క్షేత్రములు**
**కపట లోహముల కదిలిచి కామక్రోధ శత్రుల నారిటి గెలిచి**
**సఫలము జన్మము సర్వజనులకా స్వామి సందర్శనానందముచే**

ఎంత హృద్యంగా ఉందో ఈ పాట! ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు వోలేటి వెంకటేశ్వర్లు గానం చేశారు. మీరు వినదలచుకుంటే యూట్యూబ్‌లో వినే అవకాశముంది.

**https://youtu.be/EmuxAg3fwgE**

అందరూ బాగుండాలని అహర్నిశలూ తపించే వాడెప్పుడూ

ఆరోగ్యంగానే ఉంటాడు. బాగా బతికిన కాలం ఎప్పుడో దాటిపోయింది. మనుషుల మధ్య భేద భావాలు చాలా సులువుగా తేలికగా పొడచూపే యుగం, కలియుగం. మనిషి నుండి మనిషి తొందరగా విభేదిస్తాడు. తొందరగా విడిపోవాలనుకుంటాడు. కుల మత భేదాలు, వర్గ పోరాటాలు, సాంఘిక తారతమ్యాలు, జాతి భేదాలు, స్థాయి, అంతస్తుల భేదాలన్నీ రూపుదిద్దుకునే కాలమే కలికాలం.

ఎదుటివాడు, పరాయి వాడుగా కనిపిస్తూంటాడు. చివరకు భార్యాభర్తలు కూడా ఎవరి జాగ్రత్త వాళ్ళు పడే దుస్థితి దాపురించే ఈ కాలం, కలికాలం.

ఇటువంటి వాతావరణం నుండి బయట పడాలంటే 'మైత్రీ భావమొక్కటే' పరిష్కారం. ఎవరూ ఎవరిపైనా పెత్తనం చెలాయించే రోజులు కావివి. తల్లిదండ్రులు బిడ్డలతో గానీ, పరిపాలకులు ప్రజలతో గానీ చేయవలసినది మైత్రి మాత్రమే. ఈ కలియుగంలో వ్యక్తులంతా బృందమవ్వాలి. వ్యక్తి ఎంత గొప్పవాడైనా సరే ఒంటరిగా సాధించగలిగేది చాలా తక్కువ.

ఈ ధర్మమార్గంలో చేసిన ఏ ప్రయత్నమైనా సరే విశేషమైన ప్రభావం కలిగి యుంటుంది. అధర్మం లేశమైనా సరేకలి ఆవహిస్తాడు. లోకశ్రేయస్సు సాధించాలని ఏ మాత్రం అనిపించినా చాలు, అటువైపుగా మన అడుగులు పడితేచాలు. దేవ దేవుని అభయ హస్తం మన వెన్నుని స్పృశిస్తుంది. మైత్రీ భావంతోనే అంతరంగాలు ఏకమవుతాయి.

మన చిన్నప్పటి నుంచీ వింటున్న 'నేటి పిల్లలే రేపటి భావి భారత పౌరులనే మాట పాత పడిపోయింది. రాత్రికి రాత్రే దేశభక్తి పుట్టదంటే పుట్టదు. జాతీయతా భావాలు, దేశభక్తి ప్రభోధం చేస్తూ సాగే పాటలు పాఠశాలల్లోనూ కళాశాలల్లోనూ వినే భాగ్యానికి నోచుకోలేదు. అందరూ కలిసి పాడే పాటలో చైతన్య భావాలు చాలా తేలికగ్గా మనస్సులో నాటుకుపోతాయి.

ఏ రాజకీయ నాయకులైనా జాతీయ పర్వ దినాల్లో జాతీయ గీతాలు శుద్ధంగా పాడటం విన్నారా? అదేం ఖర్మమో? 'వందేమాతరం' 'జనగణమన' లాంటి ప్రముఖమైన జాతీయ గీతాలు పర్వదినాల్లోనే గుర్తుకొస్తాయి. సరిగా ఆరోజే పిల్లలచేత పాడించే ప్రయత్నం చేస్తూంటారు. ఈ రెండూ సక్రమంగా పాడటం ఎప్పుడూ గగన కుసుమ సదృశమే.

వందేమాతరం గీతాన్ని 1870లో 'ఆనందమఠం' నవలకు బంకించంద్ర ఛటర్జీ రాశాడు.

దీనికి జదూనాథ్ భట్టాచార్య సంగీతం సమకూర్చాడు. ఆలిండియా రేడియో ఢిల్లీ 'వందేమాతరం,', జనగణమన' గీతాలను ఆకాశవాణి బృంద గాన కళాకారులతో పాడించి గ్రామఫోన్ రికార్డుగా విడుదల చేసారు.

రేడియోలో మీరు రోజూ వినేదదే. దేశభక్తి గీతాలు పెదవులతో పాడేవి కావు. నాభి నుంచి పుట్టి హృదయ కంఠగతమై గొంతెత్తి పాడవలసిన ప్రబోధ గీతాలు. కవులు, గాయకులు కలిస్తే కలికాల ప్రభావం నుంచి జనం రక్షింపబడతారు.

దేశభక్తి భావాలను రగిలిస్తూ, చైతన్య భరితమైన ఎన్నో పాటలు ఒకప్పుడు వెలువడ్డాయి. ఆ కవులేరీ? ఆ పాటలేవీ?

**దేశమును ప్రేమించుమన్నా / మంచియన్నది పెంచుమన్నా**
**వట్టిమాటలు కట్టిపెట్టోయ్ / గట్టిమేల్ తలపెట్టవోయ్.**

.....

**మ్రోయింపు జయభేరి, వాయింపుము నగారా**
**తేలింపుము నభో వీధి – త్రివర్ణాంచిత పతాకా!**

.....

**మాదీ స్వతంత్ర దేశం మాదీ స్వతంత్ర్య జాతీ**

.....

**జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి**

లాంటి గీతాలు పాడేవారిలోనూ, ఆ పాటలు వినేవారిలోనూ చైతన్యాన్ని నింపవా?

గురజాడ, రాయప్రోలు, దేవులపల్లి, రజని, జాషువా లాంటి సామాజిక స్పృహ నిండుగా వున్న కవుల రసరమ్య గీతాలు, విద్యుత్తరంగాలై జాతి నరాల్లో స్ఫూర్తి నింపవా?

బాల్యం నుంచి ఇటువంటి పాటలు పాఠశాలల్లో కాలేజీల్లో నేర్పించే అలవాటు చేయద్దా?

సమాజంలో జాతీయ భావాలు ఒక్కసారిగా ఏర్పడవు. పసిపిల్లల చేత గంతులేయిస్తూ జుగుప్సాకర సాహిత్యాన్ని పాడిస్తూ వికృతానందాన్ని పొందేవారికి దేశభక్తి గీతాలు రుచిస్తాయా?

దేశానికి, ప్రజలకూ మేలు జరగాలని మనస్ఫూర్తిగా కోరుకున్న అలనాటి కవుల ఆశయాలు నెరవేరుతాయా?

# దాశరథీ నీ ఋణము దీర్ప నా తరమా



– మోదుమూడి సుధాకర్

ఈ ఫేస్ బుక్కులూ, సెల్ ఫోనులూ, టీవీలూ, వెబ్ సైట్లూ... కనీసం రైళ్ళ వంటి ప్రయాణ సాధనాలూ లేని రోజుల్లో, రెండు వందల ఏళ్ళక్రితం, భరతఖండంలో ఒక మూల ఎక్కడో ఒక వ్యక్తి సాధించిన ఘనత, సుదూర ప్రాంతాన ఉన్న మరొక వ్యక్తి తెలుసుకొని, మొదటి వ్యక్తిని కలుసుకోవాలనుకోవడం ఎంత విడ్డూరం?

కలుసుకొని, ఆ ఘనతను ప్రత్యక్షంగా చూసి, తన జన్మ చరితార్థమైందని భావించడం ఎంత విశేషం?

అదే జరిగింది 'సద్గురు' శ్రీ త్యాగరాజస్వామి విషయంలో. ఆ అనుభవాన్ని వర్ణిస్తూ, త్యాగయ్య తోడి రాగంలో పాడుకొన్న 'దాశరథీ'! నీ ఋణము దీర్ప నా తరమా?

పరమపావన నామ!' అనే కృతి పూర్వాపరాలను పరిశీలిద్దాం...

ఉత్తరభారతదేశంలో హిందువులకు అతి ముఖ్య యాత్రాస్థలమైన కాశీక్షేత్రం, సంగీతాది కళలకు పుట్టినిల్లు. రెండు శతాబ్దాలకు పూర్వం, 'గణేశ్ భావే' అనే సంగీత విద్వాంసుడు అక్కడ ఉండేవారు. ఆయన హిందూస్థానీ సంగీతాన్ని బాల్యం నుండే అవపోసన పట్టి,ఎన్నో వినూత్న ప్రయోగాలు సంగీతపరంగా చేసి, తన ప్రదర్శనలతో జగద్విఖ్యాతులయ్యారు. అయితే ఆయనకు తృప్తి కలగలేదు. తన జీవితంలో ఏదో తెలియని వెలితి.

సంగీతం యొక్క పరమార్థాన్ని తెలుసుకోలేకపోతున్నానే చింత ఆయనను దహించి వేయసాగింది. ఒకరోజు స్వప్నంలో ఆయనకు శ్రీరామ సాక్షాత్కారం కల్గి, 'నాయనా! నీ బాధ తెలిసింది. దక్షిణ భారతావని వెళ్ళి నా భక్తుడు త్యాగయ్య దర్శనం చెయ్యి. నీకు తరుణోపాయం దొరుకుతుంది" అని చెప్పినట్లు తోచింది.

కర్ణాకర్ణిగా 'వాగ్గేయకార శిరోమణి' త్యాగయ్య భక్తిని గురించి, సంగీత వైద్యం గురించి ఆయన అప్పటికే విని ఉన్నారు.

అంతే ... ఆరోజే కాలినడకన కాశీ నుండి బయలుదేరారాయన! కొన్ని పగల్ళూ,రాత్రులూ ప్రయాణం చేసి, తంజావూరు సమీపంలోని త్యాగయ్య గారి స్వగ్రామం తిరువయ్యారు చేరుకున్నారు.

సూర్యోదయ సమయం. కావేరీ నదిలో స్నాన సంధ్యాదులు ముగించుకొని, తిరిగి వస్తుంటే త్యాగయ్యగారి ఇల్లు అల్లంత దూరాన కనబడింది. 'రార మా ఇంటిదాకా' అంటూ త్యాగయ్యగారు అసావేరి రాగంలో పాడుతుంటే, ఆయన శిష్యులు వంత పాడుతున్నారు.

తంబురా చేతబట్టి, ఊరి వీధుల్లో దివ్యనామ సంకీర్తనలు పాడుతూ, ఉంఛవృత్తి నిర్వహిస్తున్న త్యాగయ్యను చూసి, పరవశించిపోయారు గణేశ్‌భావే. త్యాగయ్యగారి కృతులలో భాషలకతీతమైన భక్తిభావాన్ని దర్శించారాయన!

ప్రాతః కాలంలో ప్రకృతిని పలకరిస్తూ, తన గానామృతంతో భగవత్సాక్షాత్కారాన్ని ఎల్లరకూ కలుగజేస్తున్న త్యాగయ్యకు నమస్కరించారాయన! త్యాగయ్యగారికి తనను తాను పరిచయం చేసుకొని, తన స్వప్న వృత్తాంతం చెప్పి, 'తమ దర్శన భాగ్యంవల్ల నేటితో నా జన్మ ధన్యమైంది. సంగీత జ్ఞానము, భక్తి వినా సన్మార్గము లేదని తెలిసింది. మీ శిష్యులను చూస్తే నా కడుపు నిండిపోయింది. మీ సర్వస్వము సంగీతానికే త్యాగం చేసి, సార్థక నామధేయులయ్యారు. మీ జీవితము నా వంటి వానికి మార్గ దర్శకము' అన్నారు. 'ఎక్కడో కాశీలో ఉన్నవారికి తన గురించి తెలియడమేమిటి? తన దర్శనార్థమై రావడమేమిటి? ఆ రాముడిపై కీర్తనలువ్రాయడం వల్లనే కదా తనకీర్తి దూరదేశములకు వ్యాప్తి చెందినది! ఓ రామా! నీ ఋణము నేనెట్లు తీర్చుకోగలను?' అనుకున్నారు త్యాగయ్యగారు.

ఆశతీర దూరదేశములను
ప్రకాశింపజేసిన రసిక శిరోమణి!
దాశరథీ! నీ ఋణముదీర్ప నాతరమా!
భక్తిలేని కవిజాల వరేణ్యులు
భావమెరుగలేరని కలిలోన జని,
భుక్తి, ముక్తి కల్గునని కీర్తనముల
బోధించిన త్యాగరాజ కరార్చిత!
దాశరథీ! నీ ఋణముదీర్ప నాతరమా!

అంటూ పాడుకొని, భావేగారికి తన ఇంట సకల మర్యాదలతో ఆతిథ్యమిచ్చారు త్యాగయ్యాగారు.

వారింట, శ్రీరాముని మేలుకొలుపు మొదలు పవ్వళింపు వరకూ నిత్యం జరిగే సంగీతార్చన కళ్ళారా చూసిన భావేగారి ఆనందానికి అవధులు లేవు.

తాగయ్యగారి వలె తాను కూడా తన సంగీత వైదుష్యాన్ని ఇక నుండీ మోక్షసాధనకు వినియోగించుకోవాలని, శిష్యులకు తన విద్య బోధించి, 'సద్గురువు' గా పేరు తెచుకోవాలని నిశ్చయించుకొని, త్యాగయ్యగారి వద్ద శెలవు తీసుకొని, కాశీకి తిరిగి ప్రయాణమయ్యారు.

# డి.కె. పట్టమ్మాళ్

కె.సద్గురు చరణ్, సెల్ : 9440 709994




పురాతన హిందూ సమాజంలో పురుషాధిక్యత ప్రబలంగా ఉండేది. అంతేకాక అనేక తరాలపాటు ఆడవారి హక్కులను హరించి తెలివితేటలనుతొక్కిపట్టి, మేధస్సును వికసించనీయక పోవడం వలన కొన్ని శతాబ్దాల పాటు వారు బలహీనులుగా ఉండిపోయారు. 'ఆడదానికి ఇంటిపని, వంటపని వచ్చి, చాకలి పద్దు రాసుకునేంత చదువు వస్తే చాలు' అనే స్థితిలో ఉండేది నాటి సమాజపు ఆలోచనా విధానం.

అయితే నేటి పరిస్థితి వేరు. పురుషులతో సమానంగా స్త్రీలు కూడా అన్ని రంగాలలో ముందున్నారు. అనేక వృత్తులలో, ఉద్యోగాలలో తమ ఉనికిని, ఉన్నతిని కూడా చాటుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు పోతున్నారు. 20వ శతాబ్దపు ప్రథమార్థం వరకు మనదేశంలో ఉండిన పరిస్థితులు నేటి తరానికి హాస్యాస్పదంగా, ఆశ్చర్యంగా అనిపించవచ్చు. అందుకే నాటి ఛాందసవాదం నుండి నేటి అభ్యుదయ వాదానికి పరిణామం ఎలా జరిగిందో ప్రస్తుత తరం తెలుసుకోవడం చాలా అవసరం. సంగీత రంగాన్ని తీసుకుంటే ఆడవారిని చిన్న చిన్న శుభకార్యాలలో కుటుంబ సభ్యుల, స్నేహితుల మధ్య కూడా పాడడానికి ఒప్పుకోని ఛాందస బ్రాహ్మణ కుటుంబాల్లోని స్త్రీలు ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో దేశానికి వన్నె తెచ్చిన విద్వాంసురాళ్ళుగా ఎలా ఎదిగారో తెలుసుకోవాలంటే డి.కె పట్టమ్మాళ్ గారి జీవిత గాథను తెలుసుకుని తీరాలి. ఛాందసవాదుల కట్టుబాట్లను తెంచుకుని, సభావేదికపై కచేరీలు చేసిన మొదటి విద్వాంసురాలిగా ఆవిడ చరిత్రలో నిలిచిపోయారు.

తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాంచీపురంలో 1919 మార్చి 28న జన్మించారు. దామల్ కృష్ణస్వామి (డి.కె.) పట్టమ్మాళ్ గారు. తండ్రి దామల్ కృష్ణస్వామిదీక్షితర్‌గారు మంచి సంగీతాభిమాని. తల్లి కాంతిమతి (రాజమ్మాళ్ అని పిలిచేవారు) గారికి సంగీతంలో మంచి ప్రవేశం ఉండేది. పట్టమ్మాళ్ గారికి తల్లిదండ్రులు పెట్టిన పేరు అలమేలు. కానీ ముద్దుగా పట్టా అని పిలిచేవారు. చివరకు అదే పట్టమ్మాళ్‌గా స్థిరపడింది.

ఆవిడ చిన్నతనం నుంచి సంగీతంలో ఎంతో ప్రావీణ్యం కనబర్చారు. ఆవిడ ఒక క్రమపద్ధతిలో గురుముఖతః సంగీతం నేర్చుకోలేదు. అప్పట్లో కాంచీపురంలో ప్రసిద్ధ గాత్ర విద్వాంసులు కాంచీపురం నయనా పిళ్ళై గారి ఆధ్వర్యంలో అనేక సంగీతోత్సవాలు జరుగుతూ ఉండేవి. అక్కడ జరిగే కచేరీలలో విద్వాంసులు ఎలా పాడుతున్నారో గమనించి, ఇంటికి వచ్చి వాళ్ళని అనుకరిస్తూ పాడుతుండేవారు. తన తండ్రి నేర్పిన కొన్ని భక్తిగీతాలను కూడా పాడుతూ ఉండేవారు. ఒకసారి ఏదో ఒక పెళ్ళిలో ఆవిడ ఈ పాటలను పాడుతూ ఉండగా ఒక తెలుగు విద్వాంసుడు ఆమె యొక్క ప్రతిభను గుర్తించి, ఆమెకు కొన్ని కృతులు నేర్పారట. ఆమె యొక్క గ్రహణశక్తిని గమనించి అభ్యాస వరుసలు చెప్పకుండా నేరుగా పెద్ద పెద్ద కృతులను నేర్పారట. ఆయన పేరు తనకు తెలియదని, తెలుగులో మాట్లాడేవారు కాబట్టి 'తెలుగు టీచర్' అని పిలిచేవాళ్ళమనీ పట్టమ్మాళ్‌గారు చెప్తూ ఉండేవారు. తర్వాతి కాలంలో ఆవిడ ఎందరో విద్వాంసుల వద్ద శిక్షణ పొంది, కేవలం త్రిమూర్తులైన త్యాగరాజస్వామి దీక్షితర్, శ్యామశాస్త్రుల వారి కృతులను మాత్రమే కాకుండా ముత్తు తాండవర్, అరుణాచల కవి, గోపాలకృష్ణ భారతి, సుబ్రహ్మణ్య భారతి మొదలైన వాగ్గేయకారులు

రచించిన తమిళకృతులెన్నింటినో కూడా పాఠం చేశారు. తిరుప్పుగళ్, తేవారం వంటి తమిళ సాంప్రదాయ రచనలు కూడా నేర్చుకున్నారు. ముఖ్యంగా ఆవిడను దీక్షితర్ కృతుల భాండాగారంగా చెప్పుకుంటారు. ముత్తుస్వామి దీక్షితర్ మునిమనుమడైన అంబి దీక్షితర్ గారివద్ద, జస్టిస్ టి.ఎల్. వెంకట్రామయ్యర్ గారి వద్ద దీక్షితర్ కృతులనేకం పాఠం చేసారు. శివన్ గారి కృతులనెన్నింటినో ఆవిడ ప్రచారంలోకి తీసుకువచ్చారు.

10 సంవత్సరాల పిన్న వయసుల్లో 'పట్టా' గానం మద్రాసు కార్పొరేషన్ రేడియోలో (నేటి ఆలిండియా రేడియో) ప్రసారమైంది. పట్టమ్మాళ్ గారు చదువుకునే పాఠశాల ప్రధానోపాధ్యాయిని అయిన 'అమ్మకుట్టి అమ్మ' గారు పట్టా ప్రతిభను గుర్తించి, సంఘదూషణకు

భయపడి కుమార్తెను కచేరీలు చేయించడానికి సంశయిస్తున్న కృష్ణస్వామి గారితో వాదించి, స్త్రీలకు కూడా తమకు ప్రతిభ, ఇష్టం ఉన్న వృత్తిని ఎంచుకుని పురుషులతో సమానంగా జీవించే అవకాశాలు కల్పించాలని ఒప్పించారు. ఒకసారి పాఠశాలలో 'సత్యవాన్ సావిత్రి' అనే నాటకంలో సావిత్రి వేషం వేసే అవకాశం రావడం ఆవిడ జీవితాన్నే మలుపు తిప్పింది. ఆవిడ ఆ రోజు అద్భుతంగా గానం చేసి నటించారు. అది చాలదన్నట్లు మర్నాడు పత్రికలలో పట్టా ఫొటో, నాటిక గురించిన వార్తలు ప్రచురితమయ్యాయి. ప్రళయం వచ్చినట్లు అదిరిపడ్డారు కృష్ణస్వామి గారు, కుమార్తెకు సంప్రదాయమైన కుటుంబంలో పెళ్ళి కూడా చెయ్యలేనేమోనని నిస్పృహకు లోనయ్యారు. కొద్దిరోజుల్లోనే కొలంబియా రికార్డింగ్ కంపెనీ వారు పట్టా గానాన్ని రికార్డు చేస్తామని రావడం కృష్ణస్వామి గారిని మరింత కలవరపెట్టింది. అప్పటికి ఆవిడ వయస్సు పన్నెండేళ్ళు మాత్రమే. అప్పుడు కూడా అమ్మకుట్టి అమ్మగారే ఆయనను ఒప్పించారు. ఈనాడు ఇలాంటి సంఘటనలు చాలా హాస్యాస్పదంగా అనిపించవచ్చు కానీ అప్పటి సాంఘిక నేపథ్యంలో అది చాలా సాహసోపేతమైన నిర్ణయం.



1932 లో మద్రాసులోని రసిక రంజని సభలో ఆవిడ మొదటి కచేరి చేశారు. సంగీతానికే పూర్తి సమయం కేటాయించాలని 1933లో ఆవిడ మద్రాసులో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. మద్రాసు వెళ్ళాక తన పద్నాల్గవ ఏట ఎగ్మోర్ లేడీస్ క్లబ్‌లో మొదటి కచేరీ చేస్తే, వచ్చిన ప్రేక్షకులంతా ఒక బ్రాహ్మణ బాలిక స్టేజి మీద కచేరి చేస్తోందనే వింత చూడడానికి వచ్చారట. ఆరోజుల్లో చాలా తక్కువ మంది మృదంగ విద్వాంసులు మాత్రమే ఆడవారికి సహకారం అందించేవారు. అది కూడా వేదికపై మార్దంగికునికి గాయకురాలు కనిపించకుండా ఒక తెర కట్టి అప్పుడు కచేరి మొదలు పెట్టేవారు. క్రమంగా పరిస్థితులు మారాయి. అనేక చోట్ల కచేరీ అవకాశాలు రావడం మొదలైంది. అలా మొదలైన ఆవిడ సంగీతయాత్ర అరవై ఐదు సంవత్సరాలు నిర్విఘ్నంగా కొనసాగింది.



ఇంచుమించు అదే సమయంలో మరో ఇద్దరు మహిళామణులు ఎమ్మెస్ సుబ్బులక్ష్మి , ఎమ్మెల్ వసంతకుమారి గార్లు కూడా సంగీత రంగంలోకి ప్రవేశించి పురుషులతో సమానంగా నిలదొక్కుకుని ప్రసిద్ధి చెందారు వీరు ముగ్గురు. 'కర్ణాటక సంగీత కచేరీలు చేయడానికి అప్పుడప్పుడే పురుషులు అలవాటు పడుతున్న సమయంలో పురుషులు మాత్రమే పాడగలరనుకున్న 'రాగం తానం పల్లవి'ని కచేరీలలో పాడడం మొదలు పెట్టారు పట్టమ్మాళ్ గారు.

మనోధర్మ సంగీతంలో అత్యంత క్లిష్టమైన భాగం పల్లవి. దీన్ని పాడడానికి ఎంతో జ్ఞానం, సాధన ఏకాగ్రత అవసరం. క్లిష్టతరమైన తాళాలలో, గతులలో, విషమ జాగాలకు పల్లవులు పాడడం చాలా కష్ట సాధ్యం. సమకాలీన పురుష విద్వాంసులకు ఏ మాత్రం తీసిపోకుండా పల్లవులు పాడి తర్వాతి తరాలకు మార్గ దర్శకులు, ఆదర్శప్రాయులయ్యారు పట్టమ్మాళ్ గారు. పల్లవులు పాడడంలో మేటిగా పేరొందిన నయనా పిళ్ళైగారి ప్రభావం చిన్నతనం నుంచి ఉండడం కూడా ఆవిడను పల్లవులు పాడడానికి ప్రేరేపించింది. నయనా పిళ్ళైగారి వద్ద, విద్యల నరసింహులు నాయుడు గారి వద్ద వారు అనేక పల్లవులను నేర్చుకున్నారు. క్రమంగా పల్లవి పట్టమ్మాళ్‌గా ఆవిడ ప్రసిద్ధి చెందారు.

ఆవిడ గాన శైలి చాలా స్వచ్ఛంగా, సాంప్రదాయబద్ధంగా ఉండేది. తమిళం మాతృభాష అయినప్పటికి తెలుగు, సంస్కృత కృతుల ఉచ్చారణ చాలా స్వచ్ఛంగా, స్పష్టంగా ఉండేది. రాగభావం, సాహిత్యభావం వారి గానంలో చాలా ప్రస్ఫుటంగా కనిపించేది. ఎంత క్లిష్టమైన తాళాలలో గానం చేసినా, శ్లోకాలు, విరుత్తమ్‌లు గానం చేసినా సాహిత్య భావంలో, సంప్రదాయం విషయంలో ఎక్కడా రాజీ పడేవారు కారు. ఆవిడ చాలా క్రమ శిక్షణ కలిగిన వ్యక్తి. విద్యార్థిదశ నుండే సూర్యోదయానికి ముందే నిద్రలేచి గంటల తరబడి సాధన చేసేవారు.

ఆవిడకు ముప్ఫైయేళ్ళ వయస్సులో ఒకసారి ఎక్కడో కచేరి చేస్తున్నారట. కొన్ని అంశాలు పాడిన తర్వాత దేవగాంధారి రాగంలో సీతావర 'సంగీతజ్ఞానం ధాత వ్రాయవలెరా' అనే కృతిని గానం చేస్తున్నారట. ఉన్నట్టుండి హాల్లో ఏదో కలకలం. ప్రేక్షకులంతా భయంతో బయటకు పరుగులు తీశారు. సహకార వాద్య కళాకారులు కూడా బయటకు పరుగెత్తే వారే కానీ కళ్ళు మూసుకుని, ప్రపంచాన్ని మరచి, తాదాత్మ్యంతో గానం చేస్తున్న పట్టమ్మాళ్ గారిని చూసి అలాగే వాయిస్తూ ఉన్నారట. కాసేపైన తర్వాత ప్రేక్షకులు మెల్లగా హాల్లోకి వచ్చారట. ఆవిడకివేం తెలియవు. కృతిపూర్తయ్యాక కళ్ళు తెరచి చూస్తే ప్రేక్షకులంతా లేచి నిలబడి చప్పట్లు కొడుతున్నారు. అప్పుడు సహకార వాద్య కళాకారుడు అసలు విషయం చెప్పాడట. 'మీరు కృతి పాడుతుంటే మధ్యలో భూకంపం వచ్చిందనీ, అందరూ బయటకు పరుగెత్తి కాసేపటి తర్వాత తిరిగి వచ్చారనీ అన్నారు. దానికి వారు "నాకు పోవాలని రాసి పెట్టుంటే ఎలాగైనా పోతాను. సంగీతమే నా ఊపిరి. ప్రాణం మీద ఆశతో పాడడం ఎలా ఆపగలను?" అన్నారట. తానునమ్మిన విద్యపట్ల ఆవిడకున్న నిబద్ధత, అంకితభావం అలాంటిది. ఆనాటి కచేరికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు రావలసి ఉన్నా అనివార్య కారణాల వల్ల రాలేకపోయారట. ఈ మొత్తం విషయం తెలుసుకున్న రాధాకృష్ణన్ గారు మర్నాడు తన ఇంటికి పిలిపించి పాడించుకున్నారట.

పాపనాశం శివన్ గారు పట్టమ్మాళ్ గారిని సినిమా రంగానికి పరిచయం చేశారు. ఆవిడకి అనేక అవకాశాలు వచ్చినా ప్రేమగీతాలనెన్నడూ పాడలేదు. కేవలం భక్తిగీతాలను, దేశభక్తి గీతాలను మాత్రమే గానం చేశారు. 'త్యాగభూమి' అనే చిత్రంలో ఆవిడ మొదటగా గానం చేశారు. అనంతరం 'నామ్ ఇరువార్' వంటి చిత్రాలలో కూడా గానం చేశారు. సుబ్రహ్మణ్య భారతి రచించిన అనేక దేశభక్తి గీతాలను ప్రచారంలోకి తీసుకువచ్చారు.

వారు దేశంలోని అనేక ప్రముఖ నగరాలలోనే కాకుండా అమెరికా సంయుక్త రాష్ట్రాలు, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, శ్రీలంక, స్విట్జర్లాండ్ వంటి దేశాలలో కూడా పర్యటించి తమ గానాన్ని వినిపించారు. అనేక సన్మానాలు,బిరుదులు వారిని వెతుక్కుంటూ వచ్చి వరించాయి. 'సంగీత సాగరరత్న', సంగీతకళా శిఖామణి' సంగీత సరస్వతి', వీటిల్లో ముఖ్యమైనవి. 1961లో సంగీత నాటక అకాడమీ అవార్డు వీరికి ప్రదానం చేయబడింది. కర్ణాటక సంగీత ప్రపంచంలో భారతరత్నతో సరితూగే మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారి 'సంగీత కళానిధి' బిరుదు 1970లో వారికి ప్రదానం చేయబడింది. భారత ప్రభుత్వంచే 1971లో పద్మభూషణ్, 1998లో వారికి సంగీత నాటక అకాడమీ సభ్యత్వం (ఫెలోషిప్) లభించింది.

పట్టమ్మాళ్ గారి శిష్యులలో ప్రముఖులు వారి తమ్ముడైన శ్రీ డి.కె.జయరామన్ గారు. అనేక కచేరీలలో జయరామన్ గారు ఆవిడకు గాత్ర సహకారం అందించారు. వయసు పై బడ్డాక ఆవిడ రెండున్నర శృతిలో గానం చేసేవారు. అందువల్ల జయరామన్ గారి సహకార గానానికి శృతి అడ్డు రాలేదు. 1990లో జయరామన్ గారికి కూడా "సంగీత కళానిధి" బిరుదు లభించడం మరొక విశేషం.

ఇంకా వారి శిష్యులనేకమందిలో కోడలు లలితా శివకుమార్, మనుమరాలు నిత్యశ్రీ మహదేవన్, గీతా రాజశేఖర్, అరుంధతి సర్కార్ మొదలైన వారు ప్రముఖులు.

ఇక పట్టమ్మాళ్ గారి వైవాహిక జీవితానికొస్తే 20 ఏళ్ళ వయస్సులో ఆర్.ఈశ్వరన్ గారితో ఆవిడకి వివాహమైంది. కచేరీలతో, సాధనతో క్షణం తీరిక లేకపోయినా ఆవిడ భార్యగా, తల్లిగా తన బాధ్యతనెప్పుడూ విస్మరించలేదు. తన వృత్తిని సాకుగా చూపించి బాధ్యత ల నుండి ఎప్పుడూ తప్పించుకోలేదు. తన కుమారుని ప్రసిద్ధ మృదంగ విద్వాంసులు పాల్ఘాట్ శ్రీ టి.ఎస్.మణి అయ్యర్ గారి కుమార్తెతో వివాహం చేశారు. ఆడవారికి మృదంగ సహకారం అందించకూడదనే స్థిరమైన నియమం కల మణి అయ్యర్ గారు పట్టమ్మాళ్‌గారి కచేరీల రికార్డింగ్‌లు వివిధ రూపాలలో సంగీతాభిమాను వద్ద భద్రంగా ఉన్నాయి. ఆకాశవాణి విజయవాడ కేంద్ర ఆహూతుల సమక్షంలో ఏర్పాటు చేసిన కచేరీలో వారు గానం చేసిన భైరవి ఏకరాగ సభ 90 నిమిషాల రికార్డింగ్ ఆకాశవాణి ... గ్రంథాలయంలో భద్రంగా ఉంది. భైరవి వర్ణంతో మొదలు పెట్టి వారు గానం చేసిన కృతి, స్వరజతి, రాగం, తానం, పల్లవి, ఇతర లలిత శాస్త్రీయ అంశాలు విద్యార్థులకు, విద్వాంసులకు కూడా ఎంతో విజ్ఞానదాయకమైనవి.

జీవిత చరమాంకంలో అనారోగ్యంతో కుర్చీనే అంటి పెట్టుకుని ఉన్నా ఆ కుర్చీతోనే ఆవిడను మోసుకెళ్ళి, ఓపికున్నంత సేపు పాడించుకుని, సన్మానాలు చేసి తమకున్న గౌరవాన్ని, సంగీతాభిమాన్ని, సంస్కారాన్ని చాటుకున్నారు తమిళ సోదరులు, 90 సంవత్సరాల వయస్సులో స్వల్ప అనారోగ్యంతో 2009 జులై 16 మధ్యాహ్నం ఒంటిగంటా ముప్ఫై నిమిషాలకు ఇహలోక సంగీత యాత్ర ముగించారు పట్టమ్మాళ్‌గారు. కేవలం శిష్యప్రశిష్యుల ద్వారానే కాకుండా, అనేకమంది ఏకలవ్య శిష్యుల ద్వారా కూడా ఆవిడ గానం సంగీత ప్రపంచంలో శాశ్వతంగా నిలిచిపోయింది.

సంస్మరణ

# ఉప్పలపాటి అంకయ్య

**– అరిపిరాల విశ్వం**

స్పందన లేని సంగీతం సౌరభం లేని పువ్వు లాంటిది. లాలిత్యం, సౌకుమార్యం లేని సంగీతం ఎంత శాస్త్రీయమైనా నచ్చదు. హిందుస్తానీ సంగీతంలో రాగప్రసార పద్ధతివల్ల, ఎవరు పాడినా ఇంతో అంతో వచ్చే లక్షణం ఉంది. కాని కర్ణాటక సంగీతం కొందరి గొంతులో ఒదిగినట్లుగా, అందరి గొంతుల్లోను ఇమిడిపోదు.

గానం, ఒకొక్కరికి ఆత్మలోతుల్లోంచి ప్రవహిస్తుంది. అంతరాంతరాల్లో సుప్తమైన మన సంస్కార సంపుటిని మేల్కొలుపుతుంది. జీవుని ఆర్తికి నాదరూపంగా, లయరూపంగా, భావ రూపంగా వెలిగే సంగీతాన్ని అందించగలిగే గాయకులు ఎప్పుడో, ఎక్కడో ఎన్నో యుగాల్లో ఒకరో, ఇద్దరో పుట్టవచ్చు. పుట్టారని వినే అదృష్టం కలిగిన వాళ్ళే ఉంటారు లోకంలో ఎక్కువమంది. వారి గానాన్ని వినగలిగే మహానుభూతికి నోచుకోవటం ఎక్కడో కొద్దిమందికే అబ్బుతుంది.

ఉప్పలపాటి అంకయ్యగారు పాడటం ఒక కళ లేదా ఒక శాస్త్రం అని కాక, పాడటమే జీవితం – చేయగలిగిన తపస్సు – అన్న శ్రేణికి చెందిన మహా విద్వాంసులు. అందుకే ఆయనకు రాదగిన కీర్తి రాలేదు. కాని కీర్తిని సంపాదించిన ఎంతోమంది విద్వాంసులు, ఆయన పాదాల దగ్గర శుశ్రూష చేసి నేర్చుకోదగింది ఎంతో ఉంది. కనీసం ఆయనకు అబ్బిన విద్యకు, ఆయన చూపించే వినయం – ఒక్క నిర్లిప్త మనస్కతకే నిదర్శనం. కొందరి గానంలో లాలిత్యం ఉండొచ్చు, మరి కొందరి గానంలో నాద గాంభీర్యం ఉండొచ్చు. అన్ని ఒక్క గొంతులోనే అమరిపోవటం అరుదు. ఉప్పలపాటి అంకయ్యగారి గొంతు సంగీత క్షీరసాగరం.

నేను మొదట విన్నప్పుడు జీవుడు వేదనారణ్యంలో నించీ – భగవంతుని కోసం – పిలిచే ఆర్తనాదం ఏదో ఈయన గొంతులోనించీ వినవస్తోంది అనిపించింది. ఆ మాట ఆయనతోనే అన్నాను నేను. ఆయన తరువాత ఒకటి రెండు నెలలకే – వెళ్ళిపోయారు. అన్వేషణ, ఆవేదన, అనుభూతి – అన్నిటికీ అవధియైన పరంధామానికి.

అంకయ్యగారు చివరి రోజుల్లో గుండెనొప్పి, రక్తపుపోటుతో బాధపడుతూ ఉండేవారు. ఆ రోజు వాళ్ళింటి దగ్గర కచ్చేరీ. రమ్మంటే నేను వెళ్ళాను. శిష్యులెవరో అన్నారు "సంగీతం పాడితే గుండెనొప్పి ఎక్కువవౌతుం"దని. "పాడుతూ పోవటం కంటే నాకు దక్కవలసిన అదృష్టం ఏముంటుంది? పాడకపోతేనే నాకు జబ్బు పెరిగినట్లనిపిస్తుంది" అన్నారాయన అలాగే పాడుతూనే వెళ్ళిపోయారాయన.

జరిగిన సన్మానాల సంఖ్యని చెప్పుకుని గొప్ప వాడినని పించుకొన్నవాడు కాడాయన. జరుపవలసిన సన్మానాల సంఖ్యలాగానే అనంతుడాయన. సన్మానాలు మాత్రమే కొలబద్దలైతే, ఆయనకు లోకం చేయదగినంత గౌరవం చేయలేదు. అది విద్యకు జరిగిన అవమానం. అంతే.

కేవలం పై మెరుగులకు దాసోహం అనే లోకంలో అవి లేని వారికి ఏమీ దక్కదు. ఎప్పుడూ లోకవృత్తం అంతే. భవభూతి కూడా 'కాలో హ్యయం నిరవధిః విపులాచపృథ్వీ' అని విలపించాడిందుకే.

అంకయ్యగారు వచ్చి "ఆదివారం నాడు తప్పక రండి. క్రొత్త తంబురా కూడా వచ్చింది. అపురూప తాళంతో కూడిన కీర్తనలు కూడ వినిపిస్తాను' అన్నారు. ఆదివారం మళ్ళీ రాలేదు. మళ్ళీ ఆ పాటలన్నీ నేను వినలేను కూడ. గురువారం రాత్రికేననుకుంటా అంతా అయిపోయింది.

అప్పటికే ఒకసారి ఆదివారం నేను వస్తానని చెప్పి వెళ్ళలేకపోయాను. ఆయన నేను వస్తానని ద్వారంవైపు చూస్తూనే పాడారట ఆ రోజు. ముఖ్యమైన కృతులన్నీ నా గురించి పాడకుండా ఆ రోజుకు ఆపారట. మళ్ళీ ఆదివారంనాడైనా నేను తప్పక రావాలని – ఆయన మంగళవారం స్వయంగా

చెప్పి పోయారు. నేను తప్పక వస్తానని చెప్పాను.

గురువారం నాటి రాత్రి.

నాకు కలలు ఎక్కువగా రావు. వస్తేనే నాకు భయం.

ఆ రాత్రి కల రానేవచ్చింది. అంకయ్యగారు 'నిధి చాలా సుఖమా' అన్న కృతిని స్వర ప్రస్తారంతో సహా విన్పించారు. నేనులేచాను. 'ఇలా కల వచ్చింది. ఈ ఆదివారం తప్పక వెళ్ళాలి. బహుశా ఆయన కూడా బాధపడి ఉండొచ్చు' అనుకుంటూన్నంతలో రాత్రి రెండున్నరకు తలుపు కొట్టిన చప్పుడైంది. అంకయ్యగారి అబ్బాయి జయ త్యాగరాజు ఏడుస్తూ 'నాన్నగారు వెళ్ళిపోయారు', "మరి మాకింక దిక్కెవరు?" అంటున్నాడు.

నాకు పాట విన్పిస్తానని చేసిన వాగ్దానాన్ని యీ రీతిగా ఆ జీవుడు నిలుపుకొని చివరిసారి వెళ్లిపోయాడు. అంతే.

త్యాగరాజులాగా పాడగలిగిన సంగీతవేత్తలు దొరకవచ్చు. పాటతో బాటు త్యాగయ్య అంతటి పరవశభక్తి, చిత్తశుద్ధి, ప్రసన్నత – అంకయ్య గారిలో కన్పించాయి. లేని గుణాన్ని ఆపాదించి వర్ణించే, అవసరం, అలవాటూ నాకు లేవు. అలాగే ఉన్న అనుభూతిని దాచుకొనే సంయమనం కూడ నాలో తక్కువే. త్యాగయ్యని చూచే భాగ్యం అబ్బని అస్మదాదుల ఆత్మలకు అంకయ్యగారిలో ఆయన ప్రసన్నత, పరవశభక్తీ కన్పించాయి. శివానంద శిష్యులు స్వామి ఓంకారానందకు కూడా యిలాగే అనిపించింది అంకయ్యగారిని గూర్చి "But a real inner refinement of nature from which must spring that type of bhava which makes the true music and melody that transform and divinise more the musician than the audience he commands, is something rare. It is this rarity that Sri Uppalapati Unkaiah embodies in himself. Music Vidwands like him are essentially bhakta - siromanis; their very presence breathes out a breath of holiness, sancity, sacredness, inspiration".

పుట్టిన ఊరు తెనాలి తాలూకాలోని పెనుగుదురు పాడులో. తల్లిదండ్రులు రామలక్ష్మమ్మ, వెంకట సుబ్బయ్యగారలు. మొదటి విద్యాగురువు పినతండ్రి వీరస్వామిగారు. శ్రీ ముట్లూరి కోటిలింగం, పండిట్ కె.మునుస్వామిపిళ్ళే, తంజావూరు ముత్తుస్వామి పిళ్ళె, నాదర్ కోవెల్ రాఘవపిళ్లై గార్ల దగ్గర డోలువాద్యంలో అత్యంత కౌశలాన్ని గడించారు.

అంకయ్యగారికి డోలు వాద్యంలో అభిరుచికి కారణం అది వారి కులోత్తీర్ణ విద్య కావడమే. 1941లో కొణికి గ్రామంలో పైడిస్వామి గారితో వచ్చిందొక చిన్నవాదం. నాటినుంచి సంగీతాన్ని సాధనచేశారు.

అంకయ్యగారు "ఖరహరప్రియ" రాగాన్ని ఆలపిస్తే విన్న రాజరత్నం పిళ్ళె నాటి నుంచి మంచిమిత్రులైనారు. ఇది జరిగింది తెనాలిలో. మరోసారి ఎప్పుడో రాజరత్నంపిళ్లై సంగం జాగర్లమూడిలో నాదస్వరం కచ్చేరి చేస్తున్నారు. సభలో ఒక మూల నిలబడి ఆనందిస్తున్నారు అంకయ్యగారు. రాజరత్నంపిళ్లై అంకయ్యగారిని చూచి వేదిక పైకి పిలిచాడు. ఆప్తవాక్యాన్ని కాదనలేక వేదికనెక్కారు. రాజరత్నంపిళ్లై "ఖరహరప్రియ" పాడమని అంకయ్యగారిని అడిగాడు. తాను ప్రక్క వాయిద్యం నెరపారు. ఆనాటి సభ ఎలా ముగిసి ఉంటుందో చెప్ప నక్కరలేదుగా?

ద్వారం వెంకటస్వామి నాయుడుగారు ఒకసారి విజయ నగరంలో అంకయ్యగారి కచ్చేరి యేర్పాటు చేశారు. వారి అన్నగారితోపాటు, ఎంతో ఆనందంతో విని ముగ్ధులైనారు. వారే కాకినాడలో గల తమ మిత్రులు శ్రీ కొమ్మిరెడ్డి సూర్యనారాయణ గారికి వ్రాశారు. అక్కడ ఏర్పాటైన సభలో అపూర్వమైన తమ ప్రతిభను ప్రదర్శించారు అంకయ్యగారు.

హిందుస్తానీ – కర్ణాటక సంగీతాలను జంటకచ్చేరిలుగా మొదటిసారి శ్రీ బాబూ రాజేంద్రప్రసాద్ గారి సమక్షంలో పాడి, మన్ననలందారు. శ్రీదంతాలేతో కలిసి ఈ క్రొత్త ప్రయోగాన్ని చేశారు.

చివరి అయిదేళ్ళలో ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. గుండెనొప్పి, ఎడమచేయి జాలు ఉండి, కొంతసేపు బాధపడి వాంతి జరిగేది. తర్వాత మళ్ళీ మామూలు మనిషి అయ్యేవారు అంకయ్యగారు.

ఒకసారి కొండపల్లి కమెలి బాబాగారు వచ్చారు ఇంటికి. అంకయ్యగారు విచారంతో "మీకు ఒక పాట విన్పేంచేందుకు కూడ, చివరికి "ఆ" అని ఆలాపన చేసే శక్తి కూడా లేదు నాకు" అన్నారు.

"నా వంక చూస్తూ పాడండి" అన్నారు బాబా.

సంవత్సరం తర్వాత మళ్ళీ ఆరోజు పాడారు.

అంకయ్యగారి రుగ్మతా లక్షణాలన్ని, బాబాలో కన్పించాయి. వాంతి చేసుకొని బాబా తిరిగి సభలోకి వచ్చి కూర్చున్నారు. అప్పటి నుండి యధాప్రకారంగా అంకయ్యగారు కచ్చేరీలు చేయసాగారు.

250 బ్లడ్ ప్రెష్షర్ ఉండగా తిరుపతి దేవుని సన్నిధిలో కచేరీ చేసారు. అలాంటి సంఘటనే అనకాపల్లిలో కూడా జరిగింది. అనకాపల్లిలో మళ్ళీ మరొక సభకు కూడా ఆహ్వానం లభించింది. మూడు గంటలు కచ్చేరి. మూడే కృతులు పాడాలి. ఈ విషయాన్ని ప్రతి ఆదివారం తమ యింటి దగ్గర జరిపే సాధన సభలో చెప్పారు. నేను "నగుమోము" పాడమని అడిగాను. ఒక గంటపైగా పాడి వినిపించారు. గగనానికి, ఇలకూ బహుదూరం కాదన్న ఏదో దివ్యానుభూతి అలముకొన్నది ఆ చోటంతా.

పైడిస్వామిగారికి అప్పటికే చాలా కీర్తి ఉండేది. అంకయ్యగారు అప్పుడు డోలు వాయిస్తూ ఉండేవారు. నాదస్వర కచేరీ ఆయన చేస్తే ప్రక్కన డోలు వాయించడం ఒక పెద్ద ఘనత. ఆఘనత కోసం ఎంతోమంది ఆయనను అభ్యర్థించేవారు. ఆయన భైరవి పెద్దవర్ణం వాయించి, డోలు వాద్యం కావించేవారిని పరీక్షించేవారు. అంకయ్యగారికి కూడా యీ పరీక్ష జరిగింది. అందులో అంకయ్యగారు తమ పాండితీ ప్రతిభని చక్కగా నిరూపించుకొని మన్ననలు పొందారు. శృంగభేరి వాద్యంలో వీరి తాతగారు ఆంధ్రదేశంలో చక్కని కీర్తిని సంపాదించారు. భరతంలో కూడ ఆయన దిట్ట.

1961 డిసెంబరులో మద్రాసు సంగీత నాటక అకాడమీ ఉత్సవాలు జరిగాయి. శ్రీ వీరస్వామిపిళ్ళై అధ్యక్షత వహించారు. అంకయ్యగారు 72 అక్షరాలతో అపురూప తాళమయిన వినాయక తాళంపై పల్లవిని పాడి దాక్షిణాత్య విద్వాంసులు మెప్పులందారు. ఈ తాళం యిలాంటి మాత్రాబద్ధమై ఉంటుంది. మూడు గురువులు, రెండు లఘువులు, ఒక ప్లుతము, ఒక గురువు, రెండు లఘువులు, ఒక ప్లుతంతో– అంగసంజ్ఞ మాత్రమే కలిగి ఉంటుంది. ఇలాంటి తాళాన్ని జతి, శబ్దకౌతములు జోడించి **"నామొరాలించి నన్ను రక్షించవా, పార్వతీ తనయ నమస్తే"** అన్న పల్లవిని చక్కగా పాడి నిరూపించారు. అంకయ్యగారు పంచ ముఖ తాళాల్లో కూడ కృషి చేసారు.

మనిషి ఏదో ఒక శకంలో ఎప్పుడో ఒకప్పుడు అంతరిస్తాడు. కాని అంకయ్యగారి మరణంతో సంగీత లోకంలో ఒక అనుభూతి శకమే అంతరించిపోయింది. **– నాట్యకళ సౌజన్యంతో ...**



# నాట్య సంగీత వాగ్గేయకారులు తంజావూరు సహోదరులు

భారతదేశంలోని ప్రసిద్ధి చెందిన ఆరు నాట్యశాస్త్రాలలో భరతనాట్యం ఒకటి. దీనిని ఛదిల్‌నాచ్, దాసియాట్టమ్ మరియు చిన్నమేళం అని కూడా అంటారు. ఇది ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన ఒక నాట్యకళ. భరతం అనే పేరు భావము, రాగము మరియు తాళము అను మూడింటి కలయికగా వచ్చినది. ఇటీవలి కాలంలో భరతనాట్య ప్రదర్శనలో ఒకే నర్తకి నృత్త, నృత్య, మరియు అభినయాలను ప్రదర్శిస్తూ నృత్య అంశములు అన్నింటినీ క్రమంగా చేయగలుగుతుండడం గమనించ వచ్చును. ఇది ఒక నర్తకి సామర్థ్యమును నిరూపించుకొనడానికి ఉపయోగపడుతుంది. ఇలా ప్రకటించడానికి వీలుగా రకరకాలయిన సంగీత అంశములు వచ్చాయి. వీటిలో కొన్ని నృత్త సంబంధ సంగీత రచనలు, మరికొన్ని నృత్య సంబంధ సంగీత రచనలు ఆలాగే ఇంకొన్ని అభినయ సంబంధ సంగీత రచనలుగా చెప్ప వచ్చును. ఇందులో నృత్తానికి ప్రాధాన్యతను ఇచ్చే అంశములు అలరిప్పు, జతిస్వరము, తిల్లానా మొదలయినవి. అభినయ సంబంధ ప్రధాన అంశములు గలవి స్వరజతి, శబ్దం, పదవర్ణం, పదం, జావళి, తరంగం , రాగమాలిక, శ్లోకం మొదలయినవి. కొన్నింటిలో నృత్యానికి అభినయానికి సమాన ప్రాతినిధ్యం ఉంటుంది. శబ్దం, పదవర్ణం, రాగమాలిక, తిల్లాన మొదలయినవి వీటికి ఉదాహరణగా చెప్పవచ్చు. కావున వీటికి ఒక క్రమం కూడా ఉంటుంది. ఈ అంశాలలో మొదటగా ప్రదర్శించేది అలరిప్పు, జతిస్వరం, శబ్దం, పదవర్ణం, పదం, తిల్లాన, జావళి మరియు రాగమాలిక.

ఒకే నర్తకి ఇన్ని నాట్యసంగీత అంశాల్ని ఈ క్రమంలో ప్రదర్శించే పద్ధతి 170 సంవత్సరాల నుండి మాత్రమే ప్రచారంలోకి వచ్చింది. అంతకు ముందు ఉన్న నాట్య అంశములను జాయప సేనాని తను రచించిన నృత్తరత్నావళి అనే గ్రంథంలో వేరొక విధంగా వివరించాడు. ఈయన కంటే ముందు కాలంలో దేవేంద్రుడు సంగీతముక్తావళి అనే గ్రంథంలో లాస్య విధానాన్ని ఒక క్రమ పద్ధతిలో వర్ణించాడు. నాట్య అంశాలు వరుస క్రమంలో ముందు పుష్పాంజలి, ముఖచాలి, శుద్ధయతినృత్తం,శబ్దచాలి, సూళాది శబ్దసూళ, గీతాభినయం చివర చిందు, దరువు, ధ్రువపదం అనేవి కూడా అనుసరించేవారు.

తంజావూరు నాయకరాజులలో తులజాజీ మహారాజు రచించిన సంగీతసారామృతం లోను, మరొక గ్రంథము సంగీతముక్తావళి లోను అడుగులు అనే పదచాలనాన్ని వర్ణించారు. ఆంధ్రదేశంలో చాలా ప్రచారంలో ఉన్నది అని కూడా వర్ణించారు. ఈ రకమయిన అడుగులు, కరణములు, నాట్య సంప్రదాయానికి ప్రాతిపదికల వంటివి. వీటి నుండి విభిన్నములైన రచనలు, వానికి అనువైన నాట్య పద్ధతులు వచ్చాయి. వీటిలో తిల్లాన, పదవర్ణం, జతిస్వరం,శబ్దాలు వానికి అనువైన నాట్య పద్ధతులు తంజావూరు నాయకుల కాలం నుండి ప్రచారంలోకి వచ్చాయి. వీటిని మొదటిసారిగా రచించి ప్రచారంలోకి తెచ్చినవారు తంజావూరు సహోదరులు. ఆది పొన్నయ్య, చిన్నయ్య, వడివేలు, శివానందం అనే నలుగురు సోదరులు. వీరిది ముత్తుస్వామి దీక్షితుల సంగీత సంప్రదాయం. వీరి రచనల వలన దక్షిణ భారతదేశంలో నాట్య ప్రదర్శనకు ఒక మంచి గొప్ప సంప్రదాయము ఏర్పడినది. నాట్య సంగీత అంశములు ముందు కేవలం నాట్య ప్రదర్శనలోనే నాట్యం కోసమే పాడేవారు. తరువాత కాలంలో క్రమేణ సంగీత కచ్చేరీలలో పాడటం కూడా జరిగింది. శబ్దం, తిల్లాన మరియు పదవర్ణం వంటి రచనలు మాత్రం పూర్తిగా అవగాహన చేసుకొని ఆనందం పొందాలంటే నృత్యాభినయంతో కూడిన ప్రదర్శనల వల్ల మాత్రమే సాధ్యపడుతుంది.

తంజావూరు సంస్థానంలో భరతనాట్యాచారులుగానూ మరియు సంగీత విద్వాంసులు గా ఉండిన శ్రీ సుబ్బయ్య ఓదువార్‌కు 1802లో పొన్నయ్య, 1804లో చిన్నయ్య 1808 లో శివానందం ఇంకా 1810లో వడివేలు జన్మించారు. ఈ నలుగురు సోదరులు కూడా సంగీత త్రిమూర్తులతో ఒకరయిన ముత్తుస్వామి దీక్షితులు గారి వద్ద తెలుగు, సంస్కృతం, భరతనాట్యం, సంగీతం, జ్యోతిష్య శాస్త్రములు నేర్చుకున్నారు. వీరిలో వడివేలు మాత్రము ఏక సంథాగ్రాహిగా కూడ

ప్రసంశింప దగినవాడు. చిన్నతనమునుండే సంగీత, భరత శాస్త్రములలో పాండిత్యము కలిగి ఉండుటచే తంజావూరు ఆస్థాన విద్వాంసులుగా నియమింపబడినారు. వీరు ఎంతో ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకొని దైవభక్తి కలిగి ఉండి సంగీతమునకు సేవ చేస్తూ గడిపారు.

తంజావూరు సంస్థానంలో ఉండిన పాశ్చాత్య సంగీత విద్వాంసుడైన ఫాదరి వడివేలుకు 'వయోలిన్'వాద్యముతో పాశ్చాత్య సంగీతం నేర్పించాడు. కొంత కాలము తరువాత ఆవాద్యముపై కర్నాటక సంగీతము అభ్యశించి కర్ణాటక సంగీతమునకు ఒక గొప్ప కానుకను బహుమానంగా ఇచ్చారు. ఈనాడు కర్ణాటక సంగీతములో వయోలిన్ ప్రముఖ స్థానమును పొంది, వాద్యములలో ఒక మంచి స్థానమును ఆక్రమించడానికి వడివేలు ముఖ్య కారకులు. తన సోదరులు పాడుచున్నప్పుడు వయోలిన్ ప్రక్క వాద్యంగా వాయించి ఈ వాద్యమును ప్రక్క వాద్యంగా వాడవచ్చును అని వయోలిన్ వాద్యమునకు ఒక స్థానమును కల్పించెను.

తంజావూరు సహోదరులు తంజావూరు ఆస్థానమును సకల కళలకు నిలయంగా ఏర్పరచి అన్ని కళలను ప్రచారం చేశారు. ముఖ్యంగా వీధి నాట్యముగా ఉన్న నాట్యకళను పరిష్కరించి అందలి నృత్య అభినయములను సవరించి నాట్య కచేరీకి కావలసిన రచనలు రచించి, నాట్యమునకు ఒక స్థానమును కల్పించారు. స్వాతి తిరునాళ్ మహారాజు తన సంస్థానమునకు ఆస్థాన విద్వాంసులుగా ఆహ్వానించి ఆదరించారు. ఒక సందర్భంలో వడివేలు వాయించే వయోలిన్ వాద్యమును విని సంతోషించిన స్వాతి తిరునాళ్ వీరికి దంతంతో చేసిన ఫిడేలు వాద్యం బహూకరించారు.నాట్య కచేరీ కొరకు వీరు బృహదీశ్వర స్వామిని స్తుతించినవి, తంజావూరు రాజుని స్తుతించి రచించిన అనేక శబ్దాలు తానవర్ణములు, పదవర్ణాలు, స్వరజతులు, పదాలు, రాగమాలికలు, జావళులు, తిల్లానాలు మొదలైన అంశములు తెలుగు భాషలో అనేకము ఉన్నవి. వీరు తిరువనంతపురానికి వచ్చిన తరువాత ఇవే రచనలు మళయాళ దేశంలో కూడా ప్రచారం చేశారు. ఈ రచనలను సంస్కృత భాషలో కూడా రచించారు. ఇప్పటికీ కేరళ రాష్ట్రంలో ఈ రచనలు పాడబడుచున్నవి.

తంజావూరు సహోదరులు అనేక రాగమాలికలను, శ్లోకాలను, పదవర్ణాలను, అలాగే శబ్దములు, స్వరజతులు, పదములు, జావళులు, తిల్లానాలు నృత్య నాటకాలను పద్మనాభస్వామి స్తుతిగా రచించారు. వీరి రచనలను మరియు స్వాతి తిరునాల్ రచించిన రచనలను కలిపి స్వరతాళ గుర్తులతో గ్రంధములుగా ప్రకటించారు. వీటిని జాగ్రత్తగా భద్రపరచి ఉంచారు. కొన్ని మహారాజు రచించిన రచనలకు వడివేలు సంగీతం సమకూర్చి మహారాజు మన్ననలను పొందినట్లు తెలియుచున్నది. వీరు 600 కీర్తనలకు మించి రచించినట్టు తెలియవచ్చెను. ఈ సహోదరులు బృహదీశ్వరాలయంలో నాట్య కైంకర్యం చేసేవారు. వీరు త్యాగరాజుస్వామి ఎదుట అభినయించుటకు ముత్తుస్వామి దీక్షితులు తెలుగులో పదాలు రచించినట్లు తెలియుచున్నది.

గురువుగారయిన ముత్తుస్వామి దీక్షితులు గారిని స్తుతించి 'నవరత్నమాల' అను 9 కృతులను రచించారు సహోదరులు. 'గురుగుహ దాస', గురుగుహ భక్త', 'గురుగుహ మూర్తి' అను ముద్రలో వీరి రచనలు రచింపబడినవి. శ్రీ సుబ్రమణ్యస్వామి అనుగ్రహం వల్ల సంగీత జ్ఞానం పొందిన దీక్షితులను కూడా వీరు సుబ్రమణ్యస్వామిగా యెంచి గురుస్తుతి కృతులలో గురుగుహ ముద్రను ఉంచిరి. తమ గురువు గారి వలెనే మొట్టమొదట కృతిని 'మాయామాళవ గౌళ' రాగంలో వీరు కూడా రచించారు. 'మాయాతీత స్వరూపిణీ' అను కృతి వీరి రచనలలో మొట్టమొదటిదిగా ఉన్నది. వడివేలు సోదరులైన పొన్నయ్య, చిన్నయ్య మరియు శివానందం చివరి రోజులలో తంజావూరు సంస్థానమునకు తిరిగివచ్చారు.కానీ వడివేలు తిరువనంతపురం ఆస్థాన విద్వాంసులుగా ఉండి అక్కడే పరమపదము చెందారు.

వీరి గురించి మరిన్ని వివరములు, వారి సాహిత్యముపై మరింత పరిశోధన జరగవలసియున్నది. ఎంతో విలువైన సాహిత్య సంపదను, ఒక క్రొత్త సంప్రదాయాన్ని సంగీతరంగానికి అందించిన ఆ సోదరులు చిరస్మరణీయులు.

**యన్.నజీర్**
పి.హెచ్.డి స్కాలర్, సంగీతశాఖ
పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం
హైదరాబాద్ సెల్:-9866687786

# నేమాని అంతరంగం



శ్రీ జె.ఎస్. శాస్త్రి

**ప్రముఖ సీనియర్ మృదంగ విద్వాంసులు శ్రీ నేమాని సోమయాజులు గారి సంగీత ప్రయాణం 50వ మైలు రాయి దాటిన సందర్భంగా గానకళ సహాయ సంపాదకులు – సంగీత ప్రియులు – విశ్లేషకులు శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి వారితో అనుభవాల సారాన్ని పంచుకొన్నారు. సంగీతప్రియులు కోసం 'గానకళ' అందిస్తున్నది.**

ప్రశ్న 9: మీరు ఆకాశవాణిలో మృదంగ విద్వాంసులుగా పనిచేశారు కదా, ఆ నియామకం, ఉద్యోగం గురించి వివరించండి. అలాగే మీ మృదంగ వాదన శైలిలోని ప్రత్యేకతలేమిటో తెలియజేయండి.

1987 లో ఆకాశవాణిలో ఒక పోస్ట్ ఖాళీ వచ్చింది. ఎస్ ఎస్ శ్రీనివాసన్ గారని చీఫ్ ప్రొడ్యూసర్ ఉండేవారు. ఆయన, చిట్టిబాబుగారు స్నేహితులు. చిట్టిబాబుగారు మా సోమయాజులుకి ఏదైనా వేకెన్సీ వస్తే చూడవయ్యా అని అంతకు ముందు చెప్పారు. అది దృష్టిలో పెట్టుకుని, మేము తరచు హైదరాబాద్ వచ్చేవాళ్లం కదా, ఒకసారి వచ్చినప్పుడు ఒకటి ఉంది అప్లయి చెయ్యమను అని చెప్పారు. మరి మేము బొంబాయి వెళ్లిపోతున్నాం కదా అంటే వచ్చేటప్పుడు ఇక్కడ దిగమను అన్నారు. తిరుగు ప్రయాణంలో అక్కడ దిగి రేడియో స్టేషనుకెళ్లి ఆయన్ను కలిసాను. అప్లికేషన్ వ్రాసి ఇమ్మన్నారు, ఇచ్చాను. తరువాత ప్రభుత్వంవారు అడ్వర్టైజుమెంట్ ఇవ్వడం నన్ను ఇంటర్వ్యూకి రమ్మని లెటర్ రావడం జరిగింది. ఆ సమయంలో చెన్నైలో చిట్టిబాబుగారితో వరుస ప్రోగ్రామ్ లలో ఉన్నాను. ఆయన ఇది నీకు జీవితంలో స్థిరపడడానికి మంచి అవకాశం కదా రెండు కచేరీలు వదిలేసి ఇంటర్వ్యూకి వెళ్లొచ్చేయ్ అని చెప్పి టిక్కెట్టుకి డబ్బుకూడా ఇచ్చి పంపారు. డైరెక్ట్ గా చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చి ఇంటర్వ్యూకి హాజరయ్యాను. అంతకుముందు ఇవటూరి విజయేశ్వరరావు గారింట్లో సుమారు ఆరు సంవత్సరాలు అద్దెకు ఉండేవాళ్లం. అప్పుడాయన దగ్గర గాత్రానికి ఎలా సహకరించాలి వైలెన్ కు ఎలా సహకరించాలి ఆ మెలుకువలన్నీ నేర్చుకున్నాను. అప్పుడే తంబురా ఎలా శ్రుతి చెయ్యాలో ఆయన దగ్గర నేర్చుకున్నాను. తీగెలన్నీ వదులుచేసి ఇచ్చి శ్రుతి చెయ్యమనేవారు. అల్లా ఒకవారం సాధనచేసి నేర్చుకున్నాను. ఇంటర్వ్యూ శ్రీపాద పినాకపాణి గారు ద్వారం దుర్గా ప్రసాదరావు గారు చేశారు. ఇద్దరే అభ్యర్థులు. నేనూ, ఇంకొకతను. తంబురా వెయ్యమన్నారు, వేశాను. కచేరీ చివరలో గాత్ర విద్వాంసుడు మధ్యమశ్రుతిలో పాడతారు కదా లైవ్ లో అంత టైముండదు కదా మరి ఏంచేస్తావు అని అడిగారు. పంచమం వదిలేసి మిగతా మూడూ వేస్తానండని చెప్పాను. శభాష్ బావుందన్నారు. తరువాత బయటకొచ్చాక కాసేపటికి నేను సెలెక్ట్ అయ్యానని చెప్పారు. అందువల్ల ఆ ఉద్యోగం వచ్చి ఇలా పెన్షన్ అదీ తీసుకుంటూ సుఖశాంతులతో జీవిస్తున్నామంటే ఆ అవకాశం ఉన్న విషయం చెప్పి దరఖాస్తు చేయించిన ఎస్ ఎస్ శ్రీనివాసన్ గారు, సెలెక్ట్ చేసిన పినాకపాణి గారు, దుర్గాప్రసాదరావు గారలే కారణం. వారు ముగ్గురికీ సర్వదా ఋణపడి ఉంటాను. నిలయకళాకారునిగా నా పేరు రేడియోలో వింటుంటే గర్వంగా ఉండేది. 1990 లో మృదంగం ఏ గ్రేడ్ విద్వాంసునిగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలోనే పోస్టు ఇచ్చారు. రెగ్యులర్ గా పాడే/ వాయించే ఆర్టిస్టులకు కాక పలువురు ప్రముఖ విద్వాంసులకు రేడియోలో మృదంగ సహకారాన్నందించాను. సిక్కిల్ సిస్టర్స్, శశాంక్, ఎమ్మెస్ గోపాలకృష్ణన్, ఎమ్ చంద్రశేఖరన్, ఏ.కె.సి. నటరాజన్, ఎమ్మెస్ బాలసుబ్రహ్మణ్య శర్మ, పినాకపాణి గారలు వారిలో కొందరు. జి.ఎన్.బి గారి శిష్యులు తంజావూర్ ఎస్. కళ్యాణరామన్ గారితో రేడియోలోను, టీవీలోనూ కూడా మృదంగం వాయించాను. ఒకసారి ఎమ్మెల్ వసంతకుమారిగారు రేడియోలో కచేరీ ఇవ్వడానికి వచ్చారు. ఎస్.ఎస్ శ్రీనివాసన్ గారు మీకొక క్రొత్త విద్వాంసుణ్ణి మృదంగ సహకారానికి వేస్తున్నామని చెప్తూ నన్ను

పరిచయం చేశారు. ఆమె నా వాద్యాన్ని చాలా మెచ్చుకున్నారు. సాయంత్రం ఒక కచేరీ ఉంది అక్కడ మృదంగం వాయించడానికి రాగలరా అని అడిగారు. కాని నేను చిట్టిబాబుగారి కచేరీలో వాయించాలి రాలేనని చెప్పాను. బయటి కచేరీలలో బాలమురళీకృష్ణ, చిట్టిబాబు, ఎమ్మెస్ గోపాలకృష్ణన్, చంద్రశేఖరన్, ఎమ్మెస్‌బాలసుబ్రహ్మణ్యశర్మ,పినాకపాణి,లాల్గుడి జి.జె.ఆర్. కృష్ణన్, సుధా రఘునాథన్, నేదునూరి, నూకలచినసత్య నారాయణ, మైసూర్ దొరైస్వామి అయ్యంగార్ గార్లకు మృదంగం వాయించాను. ప్రముఖ వైలెన్ విద్వాంసులు డా.ఎల్.సుబ్రమణ్యం గారికి బొంబాయి, ఢిల్లీలలో మృదంగ సహకారాన్ని అందించాను. మైసూర్ దత్తపీఠంలో జరిగిన ఆయన మరొక కచేరీకి, బెంగళూరు, చెన్నై, త్రివేంద్రంలలో కచేరీలకూ ఘటం వాయించాను. సునాదంగా వాయించడం, సర్వలఘువు, కీర్తనకి అనుసరించడంలో గురువుగారి ముద్ర ఉండేలా వాయించడం నా మృదంగ వాదనంలో ప్రత్యేకతలు. ఎంత జటిలమైన పల్లవికైనా సునాయాసంగా అందుకోగలిగే 'స్పాట్ నాలెడ్జి' గురువుగారి బోధనలో నాకబ్బింది. ఆ విషయంలో ముళ్లపూడి లక్ష్మణరావుగారు నిష్ణాతులని చెప్తారు. నేనూ ఆ గురు' వంశం' లోని వాడినే కదా! కొన్ని మెలుకువలు ముళ్లపూడి శ్రీరామమూర్తి గారి నుండి కూడా గ్రహించాను.

గురువుగారి సంప్రదాయంలో తని ఆవర్తనంలో కుడివైపు చతురశ్రం వాయిస్తూ ఎడమవైపు జాతులు వాయించడం ప్రత్యేకత. శ్రీరామమూర్తి గారు కుడివైపు ఖండం వాయిస్తూ ఎడమవైపు జాతులు వాయించేవారు.

ఇది చాలా కష్టం. నేను కుడివైపు 3 రకాలు అంటే త్రిశ్రం, చతురశ్రం, ఖండం వాయిస్తూ ఎడమవైపు జాతులు వాయిస్తాను. దీనికి 'అవధానం' పేరిట ప్రాచుర్యం కల్పించాను. ఒకసారి కోలంక వెంకట్రాజుగారు మీ మృదంగ అనుసరణ వింటున్నాను చాలా బావుంటోంది, కుడివైపు చతురశ్రం, ఎడమవైపు జాతులు వాయించడం బావుందని ఉత్తరం వ్రాశారు. కర్నూలులో ఒకసారి కచేరి వాయిస్తే పినాకపాణిగారు వేదికపైకి వచ్చి నేను ప్రదర్శించిన ఆ ప్రక్రియ శ్రోతలకు వివరించి నన్నాశీర్వదించారు.

ప్రశ్న 10: ఉప ప్రక్కవాద్యం కావడంలో సాధకబాధకాలు కొంచెం వివరిస్తారా ?

ఘటంవాళ్ల సాధకబాధకాలు అడిగారు కదా! చాలా ఉన్నాయి. ఒక కచేరీలో ఘటం వాయించాలంటే ముందు మెయిన్ ఆర్టిస్టును అడగాలి. ఆయన నాకభ్యంతరం లేదయ్యా! మృదంగిస్టునడుగంటాడు. ఆయన సరేననాలి. ఇన్నీ కుదిరాక సెక్రటరీనడిగితే బడ్జెట్ లేదండీ అంటారు. ఇలా ఇంతమంది ఒప్పుకుంటేనే కాని ఒక కచేరీ వాయించడానికి అవదు. ఇప్పుడు మెయిన్ ఆర్టిస్టును మీ శ్రుతెంతని అడుగుతాం.

అడక్కపోయినా వైలెన్ మృదంగాలతో మేనేజ్ చెయ్యచ్చు, కానీ అదొక మర్యాద. శ్రుతీ.., నాలుగన్నరకి కొంచెం హెచ్చుండచ్చయ్యా అంటారు. లేకపోతే కొందరు నేనింకా చూసుకోలేదు చూసుకుని చెప్తామంటారు.

వైలెన్, మృదంగాలైతే కాస్త ఎక్కువ తక్కువలు సరిచేసు కోగలరు. తీరా వాయించడం మొదలుపెట్టేక ఘటం శ్రుతిలో కలవకపోవచ్చు. వెనకాల ఉన్న ఈ సాధకబాధకాలు ఎవరికీ తెలియదు. శ్రుతిలో లేదన్న కామెంట్ మాత్రం వస్తుంది. ఒకసారి ఓ సంగీతసభ సెక్రటరీ 1974–76 ప్రాంతాల్లో నన్ను పిల్చి ఏమోయ్ పంతులూ, నీపేరెప్పుడైనా హిందూలో వచ్చిందా! అని అడిగారు. రాలేదండీ అన్నాను. అలాగా, హిందూలో వచ్చాక కలు, తర్వాత మా సభలో కచేరీ ఇస్తాను అన్నారు. నిజానికి ప్రోగ్రాంకీ హిందూలో పేరు పడ్డానికి సంబంధం లేదు. అంటే హిందూలో వస్తే మనకో స్థాయి ఉందని లేకపోతే లేదని, ఇదీ వాళ్ల అభిప్రాయం.

అలాగే ఇంకొక సెక్రటరీని నాకో వంద రూపాయలిప్పించండి అని అడిగాను. ఆయనన్నాడు, అదేమిటయ్యా మృదంగానికే వంద ఇస్తున్నాము అని. మేము కూడా ప్రతిభావంతులమే అని కదా పిలిచారు. మరి సమానంగా గౌరవించవద్దా?

కానీ కొందరు పరిమితమైన శిక్షణ, అభ్యాసంతో వచ్చి, ఇంకా చెప్పాలంటే రాగం తానం పల్లవి పాడితే/వాయిస్తే జాగాకి వస్తుందో రాదోననే స్థాయివారు కూడా కేవలం మెయిన్ ఆర్టిస్ట్ అనే బ్రాండ్ మీద ఏటేటా తమ పారితోషికాలు పెంచుకుంటూ పోతారు.

ఉపప్రక్కవాద్యాలవారికి ఇచ్చే పేమెంట్ల విషయంలో సాటివారే అడ్డు తగులుతుండడం కూడా జరుగుతుంది. నా స్వానుభవమే చెప్తున్నాను. ముంబైలో ఒక కచేరీకి ఘటం వాయించడానికి ఒక మొత్తానికి ఒప్పుకున్నాను. ఆ కచేరీకే సహకారానికి వచ్చే ఆయనతో మాటల సందర్భంగా నాకింతిస్తున్నారని చెప్పాను. అతనికి అదే ఇస్తున్నారట. అదేమిటి మనిద్దరికీ ఒకేలా ఇవ్వడమేమిటన్నాడు. ఏంచేశాడో మర్నాడు నాకు నిర్వాహకులనుంచి ఫోన్, మీకంతివ్వం, అతను గొడవ పెడ్తున్నాడని.

నేను ప్రారంభంలో హరికథలకు కూడా మృదంగం వాయించాను. ఆ రోజుల్లో ఉన్న ప్రముఖ హరికథకులందరికీ వాయించాను. విజయనగరంలో ఉన్న రోజుల్లో ఒక దాసుగారు పిల్చి అబ్బాయ్, దేవీ నవరాత్రులొస్తున్నాయి కదా, ఎవరికీ ఒప్పుకోకు, నాకు వాయించాలన్నారు. నేనా ప్రకారమే ఎవరడిగినా ఖాళీ లేదని ఆయన పిలుస్తారని కూర్చున్నాను. నవరాత్రులై పోయాయి. ఒక్క రోజు కూడా ఆయన పిలవలేదు. తరువాత తెలిసింది. ఆయన వేరేవాళ్ళతో కథలు చెప్పుకున్నాడు.

కచేరీకి అందరికి కలిపి అందించిన చెక్ మార్చి ఎవరి మొత్తం వారికి ఇవ్వడానికి కూడా కొందరు ఇబ్బంది పెడతారు. నాకే ఆ అనుభవం కలిగింది. నాలుగుసార్లు ఫోన్ చేసి, రెండుసార్లు ఇంటికి వెళ్లి, అంత అవస్థ పడితేనే కానీ నా డబ్బులు నాచేతిలో పడలేదు. అలాగే ఫారిన్ ట్రిప్పులో ఎప్పుడో ప్రక్కవాద్యానికి తీసుకెళ్తామని ఊరిస్తూ మధ్యలో వచ్చే చాలా కచేరీలకు ఫ్రీగా వాయింపించేసే సందర్భాలు సంగీత ప్రపంచంలో కోకొల్లలు. అలాంటి ఫారిన్ కచేరి సిరీస్‌లకి మొదటిసారి వెళ్తున్న వాళ్లు యువ కళాకారులనే ఎంచుకుంటారు. ఎందుకంటే వాళ్లు ఆయనతో వాయించే అవకాశం, అక్కడన్నీ చూసే అవకాశం రావడంతో ఎంతిచ్చినా మాట్లాడరు కదా అని అలాగే యువకుడు కాబట్టి కూడా లగేజులవీ అందుకుంటూ సహాయంగా ఉంటాడు. అసలీ ఘటాల్నీ, కంజరాల్నీ, మోర్సింగుల్నీ ఎందుకు తీసుకువెళ్లే వారంటే రైల్వే కన్సెషన్ కి ఐదుగురు సభ్యులుండాలని ఒక నియమం ఉండేది. అందుకని ఆ నాలుగోవాడో, అయిదో వాడిగానో ఈ ఘటం, కంజిరావాళ్లని తీసుకెళ్తారు. ఘటవాద్యం వేదిక మీద ప్రదర్శించడంలో ఎదురయ్యే మరొక ఇబ్బంది గురించి వినండి. మెయిన్ ఆర్టిస్ట్ తన మైక్ సౌండ్ నిర్వాహకులతో చెప్పి పెంచుకుంటాడు. కానీ మా సౌండ్ లు పెంచుతుంటే ఇబ్బంది పడతారు. మృదంగానికైతే ఎడాపెడా రెండు మైక్ లు ఎలాగు ఉంటాయి. ఘటం దగ్గరకు వచ్చేసరికే ఇబ్బంది మొదలౌతుంది. సౌండ్ తక్కువవుతుంది. మామూలుగానే ఘటం ధ్వనీ తక్కువ ఉంటుంది,

మా సౌండ్ మాకే వినపడదు. ఆడియెన్స్ మాత్రం ఘటం సౌండ్ వినపడలేదు, బాగా వాయించలేదనుకుంటారు. మరొక విషయం. తని ఆవర్తనం దగ్గరకు వచ్చే సరికి నిర్వాహకులు మమ్మల్ని తొందరగా ముగించేయమనే సూచనలిస్తారు. శ్రోతలలో కొందరు మేం మొదలుపెట్టగానే కచేరీ ముగిసిపోయినట్టు సీట్లలోంచి లేచిపోతారు. మా సాధకబాధకాలు చెప్పమని మీరడిగారు కనుక ఈ రంగంలో 50 సంవత్సరాల నుంచీ ఉన్న అనుభవంతో చెప్పాను. అందరూ సహృదయంతో నా అభిప్రాయాలు స్వీకరిస్తారని నమ్ముతున్నాను.

ప్రశ్న 11: తమిళ వాద్యరీతికి మన పద్ధతి కి తేడా వుందా?

ఒకటికంటే ఎక్కువ ఉపప్రక్కవాద్యాలు ఉన్నప్పుడు ఆంధ్రదేశంలో మృదంగం తరువాత ఘటం వాళ్లే కూర్చుంటారు. దక్షిణాదిలో రెండో స్థానంలో కంజిర విద్వాంసుడు, తరువాత ఘటం విద్వాంసుడు కూర్చుంటారు. ఎందుకంటే అక్కడ కంజిర విద్వాంసులు ఉన్నతశ్రేణిలో ఉంటారు కాబట్టి. ఇక్కడ మాత్రం ఘటందే పైచేయి. కచేరీలలో తని ఆవర్తనం వాయించేటప్పుడు ముఖ్యంగా మిశ్రచాపులో తని ఆవర్తనం అంటే ఆంధ్రాలో మిశ్రచాపు ఒకలా వేస్తారు, తమిళ ప్రాంతాల్లో ఒకలా వేస్తారు. వాళ్లతో వాయించేటప్పుడు వాళ్లు అలా చేస్తారు, నాకిబ్బందైపోయేదలా వాయించడం, పోనీ వాళ్లిలా వేస్తారా అంటే వెయ్యలేరు. ఇలాంటి ఇబ్బందులు ఉప ప్రక్కవాద్యాలకు ఉంటాయి. వాయించగా వాయించగా అలవాటైంది. ఇప్పటికీ ఎక్కడో కొంచెం ఉంటుంది. అలాగే నేను వాయించే మొదటి రోజుల్లో ముగ్గురూ అంటే గాయకుడు, వైలెన్, మృదంగం తమిళు లే ఉండేవారు. నేను వాయిస్తున్నప్పుడు వాళ్లలో వాళ్లు ఏదో మాట్లాడుకుని నవ్వుకుంటూ ఉండేవారు. వాళ్లేం

మాట్లాడుకుంటున్నారో నాకర్థం కాదు. ఇలా కొన్నాళ్లు ఇబ్బంది పడ్డాను. కానీ ఒక్కటి చెప్పాలి, తమిళులకి భాషాభిమానం ఉంది కానీ నిజంగా ఎవరిలోనైనా ప్రతిభ ఉంటే మాత్రం వాళ్లని ప్రోత్సహించడంలో భాషాభిమానం వారికి అడ్డురాదు. దానికి ఉదాహరణ మనవాళ్లలో ప్రతిభ ఉన్నవాళ్లు అక్కడ పేరు తెచ్చుకోవడమే. అంటే ఆ స్థాయిలో ప్రతిభ ఉండాలి. ఈ విషయంలో వాళ్లను ఒప్పుకోవాలి. నన్ను కూడా అభిమానించి ప్రోత్సహించిన మార్దంగికులు ఉన్నారు. అందులో ముఖ్యంగా తిరువారూర్ భక్తవత్సలం ముఖ్యులు. ఆయనతో ఒక సంఘటన జరిగిందిలెండి.

**ప్రశ్న 12**: అనుసరణలో మీరు నేర్చిన పాఠాలు తెలియజేయండి.

ఘటం వాయించడం వల్ల నేర్చుకున్న పాఠం ఏమిటి అని అడిగారు కదా. మృదంగం వాయిస్తే మన పాఠమే మనకి వస్తుంది. అదే ఘటం వాయిస్తే దేశంలో ఎన్ని వాద్యరీతులు న్నాయో, ఎన్ని సంప్రదాయాలున్నాయో అన్నీ మనకు తెలుస్తాయి. యల్లాగారితో కూర్చుంటే వారికలా వాయిస్తాను, ఇక మా బాణీ విద్వాంసులు, గురువుగారు, శ్రీరామ్మూర్తిగారితో మరోలా, కమలాకరరావు గారితో ఇంకొక పద్ధతిలో ....... ఇలా ఎవరితో వాయించినప్పుడు వారి వాద్యంతో కలిసేలా వాయించాలి. అంతే కానీ నా పద్ధతిలో నేను వాయించుకు పోతానంటే అది మ్యాచ్ అవదు. మద్రాసులో మృదంగానికి ఘటానికి ఎక్కడా మ్యాచ్ అవదు. ఇతనో పద్ధతి వాయిస్తే అతనో పద్దతి వాయిస్తాడు. ఒకడు రెండు ఆవృత్తాలు వాయిస్తే ఒకరు. నాలుగు ఆవృత్తాలు వాయిస్తాడు. ఒకరు ఒక నడక వాయిస్తే అవతలి విద్వాంసుడు రెండో నడక, మూడో నడక, నాలుగో నడక కూడా వాయించేస్తారు. తరువాత ఈ మృదంగిష్టు ఏం చెయ్యాలి? ఆ క్రమశిక్షణ మద్రాసులో తక్కువ. అందరూ స్పీడూ, చేతులు త్రిప్పడాల్లో గొప్పవారే, లెక్కల్లో (కేల్క్యులేషన్సు) బయటపడిపోతుంటారు. లేరని కాదు అంత కాలిక్యులేటెడ్ గా వాయించే ఉపప్రక్కవాద్యాలు తక్కువ. సాధారణంగా మృదంగ విద్వాంసులు ఘటాలు ఎందుకు ఒప్పుకోరంటే నాకర్థమైంది. మొదటి విషయం ఘటాలు శ్రుతిలో ఉండవు. తర్వాత వాళ్లేదో వాయిస్తారు. వాళ్లు వాయించేదానికి వీళ్ళు వాయించేదానికి మ్యాచ్ అవదు. మృదంగిస్టు వదిలాక ఘటం ఆర్టిస్ట్ తన ఆవృత్తం వాయించాక మృదంగిస్టు కొనసాగించడానికి ఎక్కడున్నామో మర్చిపోతాడు. ఆ వాయించే ముక్తాయి జాగాకి రాదు. వాళ్ల 'షో'కి, ప్రణాళికకు అడ్డొస్తుంది. వాళ్లు సరిగా వాయించక పోయినా, లేదా తేడాగా వాయించినా వీళ్ల ఏకాగ్రత దెబ్బతింటుంది. అందువల్ల మృదంగిస్టులు ఘటం వద్దనేవారని నా అభిప్రాయం. మృదంగ విద్వాంసుడు ఏది వాయిస్తే అది వాయించాలా అంటే కనీసం ఆ గతిలోనైనా ఉండాలి కదా. మృదంగం వారు ముందుగా ఇంట్లో బాగా సాధకం చేసి చేసి వచ్చి వాయిస్తారు. వీళ్లు అలా కాదు, అప్పటికప్పుడు విని వాయించాలి. వాళ్లు ముగించిన వెంటనే తరువాతి ఆవృత్తంలో వీళ్లు వాయించాలి. అది వినాలి, అర్థం చేసుకోవాలి, ఆ ఫింగరింగ్ తోచాలి, ఆ ఫింగరింగ్ వీళ్లకి కుదరాలి, అప్పుడు వాయించాలి. ఈ మార్పంతా కొన్ని సెకన్లలో జరిగి వాయించడం మొదలుపెట్టేయాలి. ఏమాత్రం తేడా వచ్చినా పోయిందంటారు. మృదంగం అతను వాయించింది కరెక్టా, సరిగా జాగాకొచ్చిందా, అతనెన్ని అడ్జస్టుమెంట్లు చేశాడు, ఇవన్నీ తరువాత. ముందు వెంటనే ఎత్తుకోవాలి. ఒకటికంటే ఎక్కువ ఉపప్రక్కవాద్యాలు కంజీరా, మోర్సింగ్ ఉన్నాయనుకోండి. తరువాత వాళ్లకి సులువు. ముందువార్లు వాయించింది చూస్తారు కదా. ముందుగా ఫాలో అవవలసినవాడు మాత్రం ఘటం. అంటే ఘటం అనే కాదు రెండో స్థానంలో ఎవరుంటే వాళ్లు జాగ్రత్తగా ఉంటేనే కచేరీ విజయవంతం అవుతుంది. ఉపప్రక్కవాద్యంగా వాయించేవారికి మంచి టేలెంట్ ఉండాలి. అన్ని రకాల పాఠాలు తెలిసుండాలి, అన్ని రకాల విధానాలూ వాయించగలిగి ఉండాలి. అప్పుడే సక్సెస్ అవుతారు.

కచేరీ జయప్రదం మాట ప్రక్కన పెట్టి ఇతడు వ్యక్తిగతంగా జయప్రదం అవ్వాలి కదా! భగవంతుడు ఇచ్చిన వరమేమిటో అందరు మృదంగ విద్వాంసుల చేత మెప్పుపొందాను. నలుగురైదుగురితో లయవిన్యాసం జయప్రదమైందంటే ముఖ్యకారణం రెండవ స్థానంలో కూర్చున్న ఉపప్రక్కవాద్య కళాకారుడు. అతనికి మృదంగం వాళ్లది అర్థంకాక సరిగా

వాయించలేకపోతే మిగతావాళ్లూ వాయించలేరు. ఘటం వాయించడంలోని ఇబ్బందులివైతే కొన్ని సౌకర్యాలు ఉన్నాయి. కచేరీ లయపరంగా మొత్తంమీద రక్తి కట్టించవలసిన బాధ్యత మృదంగ వాదకుని మీదే ఉంటుంది. ఏదైనా కష్టమైన పల్లవి మెయిన్ ఆర్టిస్ట్ ఎంచుకుంటే దానిని ఆకళింపు చేసుకొని మొదట మృదంగ విద్వాంసుడే వాయిస్తాడు. అది విని రెండవ స్థానంలో కూర్చున్న తను, తరువాత ఇతర ఉపప్రక్కవాద్య కళాకారులు వాయిస్తారు. కాబట్టి ఎక్కువ బాధ్యత మృదంగ కళాకారునిదే. అలాగే శారీరక శ్రమ కూడా మృదంగంవారికే ఎక్కువ ఉంటుంది.

ప్రశ్న 13: అంతకు ముందు తెలియని మృదంగ విద్వాంసునితో ఘటం సహకారంలో ఇబ్బందులు చెప్తారా?

**జ.** మరి ఇప్పుడు క్రొత్త మృదంగిష్టుతో ఎలాగా అన్నారు. కొత్త మృదంగిష్టుతో అంటే ఒక విధంగా కష్టమే. పాఠాలు వాయించుకోవడం దగ్గర ఎవరి పాఠం వారు వాయిస్తారు సమస్యేమీ లేదు. తగ్గింపుల దగ్గర కొచ్చేసరికి ఇబ్బందులు మొదలవుతాయి. ఉపప్రక్కవాద్యాల వాళ్లు చాలా షార్ప్ గా ఉండాలి. అలాగే కొన్ని పరిమితులకు లోబడే ప్రదర్శించాలి. మృదంగిస్ట్ వాయించినంతా తన వంతు వచ్చినప్పుడు తిరిగి వాయించకుండా కొంత తక్కువే వాయించాలి. మద్రాస్ మ్యూజిక్ అకాడమీలో వరుసగా 20 సంవత్సరాలు వాయించాను.

2 సంవత్సరాలు పాల్ఘాట్ రఘు గారితో వాయించాను. ఒకసారి హైదరాబాద్ బ్రదర్స్ గాత్రం ఆయన మృదంగం, శ్రీ పేరి శ్రీరామ్మూర్తి వైలెన్, శ్రీ అభిషేక్ రఘురామ్ కంజీరా. రఘు మహావిద్వాంసులు. ఆయన ఏం వాయిస్తున్నారో పట్టుకోవడం కష్టం. ఇలాంటి సీనియర్ మృదంగ విద్వాంసులు అక్కడివారిని శివరామన్ గారిని, రఘుగారిని, వేరే పెద్ద విద్వాంసులవీ ఒక్కొక్కరిని రెండో మూడో వార్ల నడకలు, ముక్తాయిలు సాధన చేసుకుని ఉండేవాడిని. వార్లతో కచేరీలప్పుడు వాయిస్తే వాళ్లు సంతోషించేవారు. ఆ కచేరీలో రఘు తగ్గింపు వాయించి నాకు ఛాన్స్ ఇచ్చారు. గేప్ ఇవ్వకూడదు, ఇచ్చామంటే మనకర్థం కాలేదనుకుంటారు. నిజానికి అర్థం కాలేదు. ఏం చేశానంటే ఆ స్టార్టింగ్ పాయింట్ తెలుసుకదా అక్కడ ఒకసారి 'టక్' మని కొట్టగానే శభాష్ అన్నారు. వాయించలేదు. కానీ కరెక్ట్ గా ఎత్తుకోవడంతో మెచ్చుకున్నారు. తరువాత ఏదో మేనేజ్ చేసి వాయించేశాను. అందరికీ అన్నీ అర్థం కావాలనేం లేదు. సమయస్ఫూర్తి చాలా ముఖ్యం.

ప్రశ్న 14: మీ సంగీత యాత్రలో అతి ముఖ్యమైన మలుపు, చాలామందిని విస్మయానికి గురిచేసిన నిర్ణయమూ జలతరంగం కళాకారునిగా మారడం. ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ప్రేరణ, ఆ మారడంలో మీ కృషి, సాధించిన విజయాలు ... వివరించండి

**జ.** 2000 'శ్రుతిలయ' ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ వారు సన్మానం చేసి 'ఘటవాద్య చక్రవర్తి' అని బిరుదు ఇచ్చారు. ఆసందర్భంగా నన్ను ఒక ఘటం ప్రోగ్రాం వాయించమన్నారు. 6 ఘటాలతో తబలా, వైలెన్ ప్రక్కవాద్యాలతో 'ఘట విన్యాసం' కచేరీ చేశాను. అది చాలా బాగా వచ్చింది. అది చూసి చాలామంది ఆ పద్ధతిలో వాయించమన్నారు. కానీ 6 ఘటాలు పట్టుకుని ఎక్కడ వెళ్లగలం అని మానేశాను. కనీసం టీవీలోనూ, రేడియోలోనూ ప్రోగ్రాం చెయ్యవల్సింది, ఆ ఆలోచన రాలేదు. అప్పటికి కెరీర్ విజయవంతంగానే ఉన్నా ఒక విధమైన అసంతృప్తి మాత్రం ఉంటూ ఉండేది. పెద్దసభల్లో వాయించాను, చిన్న సభల్లో వాయించాను,

బ్రహ్మోత్సవాల్లో వాయించాను. ఎన్నాళ్లిలా? మృదంగం వాయించడం, ఘటం వాయించడం. ఇంతేనా?

ఏదో ఒకటి క్రొత్త చెయ్యాలి. ఇవే ఆలోచనలు. ఏ వీణలాంటిదైనా వాయిద్దామన్నా అప్పటికే నాకు వయస్సు 50. ఇవేం జరిగేపనులు కావు. పైగా ఏ విభాగంలో చూసినా అందులో పేరు తెచ్చుకున్న వాళ్లు బోలెడుమంది ఉన్నారు. ఇలా ఆలోచిస్తూ ఉండగా ఈ 'షడ్ఘట విన్యాసం' విజయం ఆ ఆలోచనలకు ఊతం ఇచ్చింది. వీటన్నిటికీ మూలం జలతరంగమే కదా. అదైతే నాలుగు కీర్తనలు వాయించుకోవచ్చు, సోలో కచేరీకదా. అని జలతరంగం మీద దృష్టి కేంద్రీకరించాను. జలతరంగం అయితే అప్పటికెవరూలేరు. జలతరంగంకి కావలసినవన్నీ ఒక సెట్ తెప్పించి ట్యూనింగ్ చేసుకొని గీతాల వరకు నేర్చేసుకున్నాను.

అక్కడివరకు నాకొచ్చు. విజయనగరంలో ఉన్నప్పుడు వైలెన్ గీతాల వరకూ సాధకం చేశాను. ఆ జ్ఞానంవల్ల నేనే శ్రుతి చేసుకుని, శ్రుతి చేసుకోవడం వచ్చుకదా, వాయించి ప్రాక్టీస్ చేశాను. ఆ తరువాత మనకి కీర్తనలు కావాలి, నొటేషన్ కావాలి. ఇంకోటి, ఎవరయ్యా మీ గురువంటే రాత్రికి రాత్రి నాకల్లా వచ్చేసింది అంటే ఎబ్బెట్టుగా ఉంటుంది. కాబట్టి ఒక గురువుండాలి. వీణ విద్వాంసులు శ్రీ డి. శ్రీనివాస్ నాకు మంచి స్నేహితులు, రేడియోలో సహోద్యోగి, చాలా కచేరీలు కలిసి వాయించాం. అతని దగ్గరకు వెళ్లి శ్రీనివాస్, నువ్వీ వేళనుంచీ నాకు గురువయ్యా అన్నాను. అతను, నేను మీకు గురువేమిటండీ బాబూ మీకొచ్చిన పేరులో సగం నాకొస్తే చాలండి జీవితంలో అన్నారు. అలాకాదయ్యా అవన్నీ వేరు, నాకిప్పుడు నొటేషన్ కావాలి, అవే కీర్తనలకి నేను పక్కవాద్యంగా ఇన్నాళ్లూ వాయించడం వేరు, స్టేజిమీద మెయిన్ ఆర్టిస్టుగా వాయిస్తున్నానంటే పక్కా నొటేషన్ ఉండాలి అన్నాను. అతను సరేనని ఒక కచేరీకి సరిపడా ఏమిటిమిటి కావాలో అన్నీ ఇచ్చేశాడు. అవన్నీ విని విని ఉన్నాంకదా, ఆకీర్తన దగ్గర పెట్టుకుని స్వరస్థానాలు సెట్ చేసుకుంటే ఇట్టే వచ్చేశాయి. అలా ఒక గంట కచేరీకి కావలసినవన్నీ తయారై ఆరు నెలల్లో మొదటి కచేరీ ఇచ్చాను. డి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో దసరా పండుగలలో సాయిబాబా ఆరాధన చేస్తూ సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్కడ నా మొట్టమొదటి జలతరంగం కచేరీ చేయడం జరిగింది. అది ఆంధ్రదేశమంతా గుప్పుమంది, నేమాని సోమయాజులిల్లా జలతరంగం వాయిస్తున్నాట్ట అని. దాంతో ప్రతీవాళ్లూ పెట్టడమే. ఆంధ్రా అంతా మొదటి రౌండ్ తిరిగొచ్చేశాము. జనం బ్రహ్మాండంగా వచ్చేవారు. మొన్నటిదాకా ప్రక్కవాద్యం వాయించాడు కదా ఈయనెలా వాయిస్తున్నాడో చూద్దామని. తాళవాద్యాల నేపథ్యంతో రావడం వల్ల నా వాద్యంలో విపరీతమైన స్పీడుంటుంది. దాంతో శ్రోతల్లో ఒక విధమైన అలజడి, కుతూహలం కలుగుతుంది. హైదరాబాద్ కాకుండా బయట కచేరీలు చేయడం మొదలు పెట్టినపుడు రాజమండ్రిలో మొదటి కచేరీ అడిగిన వెంటనే సంతోషంగా పెట్టినది శ్రీ నిమ్మలపూడి వీర్రాజు. ఆయన అందించిన ప్రోత్సాహానికి జోహార్లు. కచేరీ ఏర్పాటు చెయ్యడమే కాదు, నాకు సన్మానం చేసి 'జలతరంగ కళాప్రవీణ' అనే బిరుదు కూడా ప్రదానం చేశారు. ఆవిధంగా రోజుకి నాలుగు గంటలు సాధన చేస్తూ రాగాలాపన, స్వరకల్పన, ముక్తాయిలు ఇవన్నీ చేర్చుతూ ఎలా రెండు, రెండున్నర గంటల కచేరీగా రాగం తానం పల్లవి సహా వాయించాలా అని రూపకల్పన చేసుకుంటూ వచ్చాను. నాలుగైదు వేలకి పైగా ప్రదర్శనలు ఇచ్చి ఉంటాను. ప్రక్కవాద్యాలుగా ఎందరో పెద్ద విద్వాంసులు గొప్ప మనసుతో వైలెన్ మృదంగాలతో కచేరీకి సహకారం అందచేశారు. ఆ స్థాయి వాళ్లను ప్రక్కవాద్యాలుగా వేసుకుని వాయించడమంటే సామాన్యమైన విషయం కాదు. నేను సబ్జెక్ట్ లో ఎక్కడైనా దొరికిపోతే వాళ్లు నాకు చెమటలు పట్టించేస్తారు. ఒక్క కచేరీ చేసినా చాలు, ఆయన జలతరంగం కళాకారుడు కూడానని బయోడేటాలో వ్రాసుకోవచ్చు అనుకుని ఈ రంగంలోకి దిగాను. దిగేక నష్టపోలేదు. బాగానే జరిగింది. ప్రక్కవాద్యంగా ఉండి ఏమిటేమిటి పొందలేక పోయానో అవన్నీ మెయిన్ ఆర్టిస్ట్ గా సాధించాను, సక్సెస్ అయ్యాను.

ఇప్పుడైతే ' నేమాని సోమయాజులు  పార్టీ' అని వేస్తారు. ఇలా మెయిన్ ఆర్టిస్ట్ గా గుర్తింపు, సదుపాయాలు పట్టుదలగా సాధించుకున్నాను. నాలుగు సీడీలు విడుదల అయ్యాయి. ఇదివరకు మృదంగం, ఘటం సహకారం వాయించిన సీడీలున్నాయి. ఆ మెయిన్ ఆర్టిస్ట్ మీకు నచ్చకపోతే ఆ సీడీ వినరు. ఒకవేళ విన్నా గంట రికార్డులో 55 నిమిషాలు అతని పాట వింటే చివర్నెక్కడో నా వాద్యం వస్తుంది. ఇది అలా కాదుకదా! ఎన్నో సంస్థలచే సత్కారాలు, బిరుదులు, ప్రశంసలు పొందాను. ఇలా జలతరంగంతో మంచి గుర్తింపును పొందానన్న తృప్తి నాకుంది. నేను జలతరంగం వాయించడం కొన్ని ప్రయోగాలు చేసి సత్ఫలితాలు సాధించాను. తాళవాద్యాలతో పాటు ప్రదర్శించే 'కొనక్కోల్' (కొనగోల్) అనే విన్యాసప్రక్రియ ఒకటి ఉంది. ఎక్కువ వాడకంలో లేని ఆ ప్రక్రియను నా జలతరంగం కచేరీలలో చేర్చాను. అది నేనే నిర్వహిస్తాను. గమకం వాయించడంలో అంతకుముందులేని ఒక వాదనశైలి వాడుకలోనికి తెచ్చాను. అలాగే స్వరం ఎక్కువసేపు వినబడి దీర్ఘంగా ధ్వనించేలా ఒక మార్పు వాయించడంలో

తీసుకువచ్చాను. 'శహన' వంటి శాస్త్రీయ రాగాలను కూడా పలికిస్తున్నాను. వాద్య పరికరంతో వినూత్న ప్రయోగాలు చిట్టిబాబు గారు ఎక్కువ చేస్తుండేవారు. అలాగే సమయస్ఫూర్తి కూడా ఆయన విజయాలకు ఎంతో దోహదం చేసింది. ఆయనతో చిరకాలం కలిసి వాయించడం వల్ల ఈ రెండు అంశాలు వారినుంచి నేర్చుకున్నాను. వాద్య పరికరం వేరైనా ఆయన ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకున్నాను. చిట్టిబాబుగారి సతీమణి ఐ.ఐ.టి., చెన్నైలో నా జలతరంగం కచేరీ విని అభినందించారు. హైదరాబాద్ నగరంలో కళాసాగరం, సికా, విజ్ఞాన సమితి వంటి పలు సంస్థలు, వేములవాడ, యాదగిరిగుట్ట, అన్నవరం దేవస్థానాలు, విజయవాడలో సంగీత సన్మండలి, స్వరఝరి సంస్థలు, నాగార్జున సాంస్కృతిక కేంద్రం, గుంటూరు, హిందూ సమాజం, రాజమండ్రి, శారద కళాసమితి, ఆకివీడు, శ్రీరామ సమాజం, కాకినాడ, విజయత్యాగరాజ సంగీతసభ, విశాఖపట్నం, సంగీతకళల, విజయనగరం, ఇండియన్ ఫైన్ ఆర్ట్స్, మైలాపూర్, చెన్నైలలోనూ, కొత్తగూడెం, వరంగల్, పాలకొల్లు, భీమవరం, సర్పాపురం, స్టీల్ ప్లాంట్, శ్రీకాకుళం, బరంపురం, ఒంగోలు పట్టణాలలోనూ ఇంకా అనేక వేదికలపై జలతరంగం కచేరీలు చేశాను. తిరుమలలో స్వామివారి బ్రహ్మోత్సవాలలో రెండుసార్లు, సాంస్కృతిక శాఖవారు నిర్వహించిన త్యాగరాజ ఉత్సవాలలో, అక్కడ జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలోనూ వాయించాము. ఎస్వీబీసీ వారి నాదనీరాజనం కార్యక్రమంలో మూడుసార్లు మా బృందం జలతరంగ ప్రదర్శనలిచ్చాం. అమెరికాలో కూచిభట్ల ఆనంద్ గారి ఆధ్వర్యంలో సిలికానాంధ్రలో, క్లీవ్ ల్యాండ్ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలలోనూ వాయించాము. 'భారత్ భవన్' భోపాల్ లో 'జలతరంగం 'ఉత్సవం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్వాంసులందరూ పాల్గొన్నారు. ఇంచుమించు అందరూ హిందుస్థానీ విద్వాంసులే. కర్ణాటక సంగీత విద్వాంసులు నేను, శ్రీ అనయంపట్టి గణేశన్ మాత్రమే. నా వాద్యాన్ని అక్కడి హిందీ వార్తాపత్రికలు ప్రముఖంగా శ్లాఘించాయి. ముళ్లపూడి శ్రీరామమూర్తి, వంకాయల వెంకటరమణమూర్తి, ఎమ్.ఎల్.ఎస్. రాజు, అంపోలు మురళీకృష్ణ, ఫల్గుణ్, పత్రి సతీశ్ కుమార్ వంటి ప్రముఖ విద్వాంసుల వైలెన్ మృదంగ సహకారాలతో వాయించాను. అవికాక మండ సుధారాణి గాత్రం, వేణు విద్వాంసులు నాగరాజు, మండా అనంతకృష్ణ గార్లతో కూడా జలతరంగం కచేరీలు చేశాను. నా జలతరంగం వాద్యంతో నాలుగు సీడీలు వెలువడ్డాయి. మొదటిది సత్యసాయిబాబా భజనలతో వారి ఆశీస్సులతో, రెండవది త్యాగరాజ కీర్తనలు, మూడవది శ్రీచక్ర సిమ్మెంట్స్ వారి సౌజన్యంతో భద్రాచల రామదాసు కీర్తనలతో, నాల్గవది అన్నమాచార్య కీర్తనలతో విడుదల కావడం జరిగింది. నాలుగు సీడీలలో మృదంగ ఘటవాద్యాలు నేనే వాయించాను.

ప్రశ్న 15 : విశ్రాంత జీవితంలో సంగీత బోధనాపరమైన కొన్ని బాధ్యతలు స్వీకరించినట్టు విన్నాం. ఆ వివరాలు తెలియజేస్తారా?

2007 లో అనుకుంటా నాదతరంగం ట్రస్ట్ అని సంస్థ ప్రారంభించి మూడేళ్లు వరుసగా పెద్దపెద్దవాళ్లందర్నీ పిలిచి కొందరికి 'రత్న ' అనే బిరుదులు వైణికరత్న, వాయులీనరత్న ఇలా, ఇచ్చి సంగీతసభలు జరిపాము. 2010లో రిటైర్ అయ్యాను. పిల్లలందరికీ ఉద్యోగాలు వచ్చాయి. వార్ల వాళ్ల పనులలో బిజీ అయిపోయారు. నేనొక్కడినీ చెయ్యాలంటే కష్టమని, రిటైర్డ్ జీవితం ప్రశాంతంగా ఉండాలని ఆ ట్రస్టును రద్దుచేసేనాను. 2004 లో ఉమయాల్పురం శివరామన్ గారి బృందంతో అమెరికా వెళ్లి ఆయన మృదంగం సోలోకి జలతరంగం లీడ్ వాయించే అవకాశం వచ్చింది. రెండున్నర నెలల టూరది. ఇరవై నాలుగు అమెరికన్ యూనివర్సిటీలలో ప్రదర్శనతో కూడిన సోదాహరణం ప్రసంగాలు, ఇతర కచేరీలు చేశారు. అదొకటి చెప్పుకోదగ్గది. 2010 జూన్ 30న రిటైర్ అయ్యాను, జూలై ఒకటినే వాసవీ సంగీత కళాశాలలో ప్రిన్సిపాల్ గా చెయ్యమని ఆఫర్ వచ్చింది. ముందు చెయ్యగలనా అని సందేహ పడ్డాను. తర్వాత చెయ్యగలనని అనిపించింది. ఒప్పుకున్నాను. ఏడు సంవత్సరాలు ఆ పోస్ట్ లో పనిచేసి కాలేజీ బాగా అభివృద్ధి చేశాను. ఈ మధ్యలో తెలుగు యూనివర్సిటీ ఎం.ఏ కోర్సుకి మూడు సంవత్సరాలు బోధించాను. అప్పుడు ఎం.ఎ సిలబస్ మార్చి కొత్త సిలబస్ పెట్టి, అక్కడ లిపి అంటే నొటేషన్ వ్రాసే విధానం కూడ మా ముళ్లపూడి లిపే పెట్టించాను. పరీక్షల నిర్వహణ కూడా చేశాను. మొత్తంమీద నాలుగు సంవత్సరాలు యూనివర్సిటీకి పనిచేశాను.

**(మిగతాది తరువాయి సంచికలో)**

శ్రీ వాడ్రేవు సుబ్బారావు గారు వైణిక విద్వాంసులు శ్రీ మంచాల జగన్నాథరావుగారి తమ్ముడు శ్రీ వాడ్రేవు పురుషోత్తం గారి అబ్బాయి. శ్రీ జగన్నాథరావుగారి శతాబ్ది ఉత్సవ నిర్వహణ కంకణ ధారులు. సంగీత రంగంలో పేరు ప్రఖ్యాతులు గడించి వయోభారంతో ఇంటికే పరిమితమైపోయిన విద్వాంసులందరిని కలిసి ఆ దృశ్యమాలికను గానకళ పాఠకులకు అందిస్తున్నారు.



శ్రీమతి రాయప్రోలు జానకి దేవి (93 సం॥)



శ్రీమతి టి.టి. సీత (92 సం॥లు)



శ్రీమతి అరుంధతి సర్కార్ (85 సంవత్సరాలు)



శ్రీమతి శారదా శ్రీనివాసన్
(86 సం॥లు)



శ్రీ ఆకెళ్ళ మల్లికార్జున శర్మ
(85 సం॥లు)



శ్రీమతి శారదా అశోక వర్ధన్
(85 సం॥లు)

## సరస్వతి గానసభ (రి) కాకినాడ వారి 118వ దసరాసంగీత ఉత్సవాల రెండవ విడత కార్యక్రమాలు



30.3.2022 న ప్రిన్స్ రామవర్మ గాత్ర సంగీతసభ



31.3.2022 న శ్రీమతి జయంతి శ్రీధరన్ గాత్రం



1.4.2022 న శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి గాత్ర సంగీతసభ



గాయత్రి మహిళా సంగీత సన్మండలి, గుంటూరు నందు 19.3.2022న అష్టావధానము నిర్వహించిన శ్రీ తాతా రమ సత్య సందీప్ శర్మ



అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు వారిచే పురస్కారం పొందిన సంగీత విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి



తణుకు శ్రీ త్యాగరాజ ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న పద్మశ్రీ, నాదసుధార్ణవ శ్రీ అన్నవరపు రామస్వామి



వరంగల్ జరిగిన త్యాగరాజ ఆరాధన



# సంగీత సభల కార్యకలాపములు – 'విహారి'

## వీణ ఉత్సవ్ – 2022

విజయనగరం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 627వ కార్యక్రమంలో భాగంగా శ్రీనాదవర్ధని సంగీతాలయం సంయుక్త నిర్వహణలో శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో 18.3.2022 శుక్రవారం సాయంత్రం వీణ ఉత్సవ్ – 2022 నిర్వహించడం జరిగింది. స్థానిక వీణా విద్వాంసులు 7 కృతులతో వాద్య గోష్ఠి చేశారు. అనంతరం ప్రముఖ వైణికురాలు ఆకాశవాణి ఎ గ్రేడ్ కళాకారిణి మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల పూర్వ అధ్యాపకులు చుక్క బాల సరస్వతి గారికి "శ్రీవీణా నాదవర్ధని" అనే బిరుదుతో సన్మానించడం జరిగింది.





ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ పక్షాన అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, ఉపాధ్యక్షులు దూసి శివరామ శర్మ, దేవరాజు గోపాలకృష్ణ, కోశాధికారి మహేశ్వరరావు, సలహాదారులు అయ్యగారి రాఘవరావు, సుబ్బారావు పాల్గొనగా నాదవర్ధని సంగీతాలయం తరపున డాక్టర్ కె. ఎ.పద్మప్రియ, రోజారాణి, నిరుపమ, మేడూరి లక్ష్మి పాల్గొనగా స్థానిక విద్వాంసులు భాగవతుల వంశీకృష్ణ, వేదాల మంగతాయారు, గంధం సుజాత, బులుసు సంధ్యారూప తదతరులు పాల్గొన్నారు.. మృదంగంపై డాక్టర్ మండపాకరవి, శివకుమార్, పేరి కామేష్, మహేశ్వర రావు సహకారాన్ని అందించారు. ఆలయం తరపున అర్చకులు ఆశీర్వదించి అమ్మవారి ప్రసాదం అందించడం జరిగింది.

– డాక్టర్ మండపాక రవి

## శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవ సొసైటి – తణుకు

దాదాపు రెండేళ్ళ విరామం తర్వాత తణుకు శ్రీ రామకృష్ణ సేవాసమితిలో సద్గురు శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవ సొసైటి వారు నిర్వహించిన సంగీత కచేరీలు సంగీతాభిమానుల నెంతగానో అలరించినవి. 28.3.22 న శ్రీ గురజ ద్రోణేంద్ర ఫణికుమార్, ఫ్లూట్ కచేరీకి శ్రీ పి.నందకుమార్ వయోలిన్, శ్రీ బి.సురేష్ బాబు మృదంగం. వాతాపి హంసధ్వనితో ప్రారంభించి ఎందరో మహానుభావులు, మరుగేలరా వంటి కృతులను చక్కగా వాయించారు.

చివరలో వారు వాయించిన పిబరే రామరసం... శ్రోతలను అలౌకిక ఆనంద రసాబ్ధిలో ముంచింది. అందుకు ఆద్యంతం సహకార వాయిద్యాలు అంతగానూ తోడ్పడ్డాయి.



29.3.22న శ్రీ మల్లాది నరసింహారావు చాలా బాగా పాడారు. గురువుగారు శ్రీ బాలమురళీ కృష్ణ గారి చిత్రపటం స్టేజిమీద ఉంచి, వారి సన్నిధిలో పాడుతున్నంత భక్తితో గానం చేశారు. సావేరి వర్ణంతో ప్రారంభించి, కొన్ని కృతులు పాడి కల్యాణి రాగం మెయిన్‌గా తీసుకుని రాగ ప్రస్తారం నిరవల్ స్వరకల్పనలు ఎంతో చక్కగా పాడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. వైలెన్ సహకార మందించిన శ్రీ సరస్వతుల పార్థివ వాయించిన రాగప్రస్తారం, స్వరకల్పనలు అంతగానూ అలరించినవి! శ్రీ సరస్వతుల హనుమంతరావు మృదంగ సహకారం, తన్యావర్తం

ఆహా! అనిపించింది.



30.3.3022న శ్రీమతి డి.వర్ధని గారి గాత్రకచేరి. నాటరాగకృతితో మొదలుపెట్టారు. సరససామదాన, మరి కొన్ని కృతులు త్యాగరాజువే పాడి, వాచస్పతి రాగాన్ని ప్రధానంగా ఎంచుకుని,' కంటచూడు మీ...' కృతికి చక్కని స్వరకల్పన చేశారు.

చిన్నపిల్లై ఉండి సీనియర్ విద్వాంసుల సరసన వైలెన్‌పై ప్రతిభావంతంగా సహకారాన్నందించిన చి.గాయత్రి శివాని శ్రోతలను ఎంతగానో అబ్బురపరిచింది!.

శ్రీపారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ మృదంగం పైనా శ్రీ సరస్వతుల హనుమంతరావు ఘటంపైన వాయించిన తని శ్రోతల కరతాళ ధ్వనులందుకున్నవి. చివరగా చల్లరే.. వంటి దివ్యనామ కీర్తనలను పాడి ముగించారు.



31.3.22 సాయంత్రం తణుకు శ్రీ రామకృష్ణ సేవాసమితిలో సద్గురు శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవ సొసైటి మరియు, రాయసం రాజ్యలక్ష్మి సంగీత నృత్యకళాశాల సంయుక్త నిర్వహణలో నాదసుధార్ణవ డాక్టర్ శ్రీ అన్నవరపు రామస్వామి గారు పద్మశ్రీ పురస్కారం అందుకున్న సందర్భంగా ఘనసన్మానం జరిగింది. సన్మాన సభకు డా॥ శ్రీ రామబ్రహ్మం అధ్యక్షత వహించగా శ్రీమతి గుమ్ములూరి ఇందిర జ్యోతి ప్రజ్వలన చేసి సభా ప్రారంభం చేశారు.

రాయసం రాజ్యలక్ష్మి సంగీత కళాశాల విద్యార్థినులు "త్యాగయ్యా ఇదిగో నీ కీర్తికి మా కీర్తన" అంటూ ప్రార్థన పాడారు. ముఖ్య అతిధిగా వచ్చిన విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ (కళాభారతి) కార్యదర్శి శ్రీ గుమ్ములూరి రామకృష్ణప్రసాద్ (రాంబాబు) మాట్లాడుతూ, మహిళా మణులు వైభవంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. శ్రీమతి భమిడి కమలాదేవి తాను రూపొందించిన సన్మాన పత్రం చదవగా అనంతరం సొసైటీ తరపున శ్రీమతి మల్లిన భద్రమ్మ, రామచంద్రరావు దంపతులూ, రాయసం రాజ్యలక్ష్మీ సంగీత కళాశాల సొసైటీ సెక్రెటరీ గారైన భమిడి విశ్వనాథ శర్మ, కళాశాల ప్రిన్సిపాల్, శ్రీమతి భమిడి కమలాదేవి దంపతులు, గురువు గారిని శాలువలతో, నూతన వస్త్రములతో సత్కరించగా శ్రీమతి సి.హెచ్.కె. సుజాత శ్రీ సి.హెచ్. రామకృష్ణ దంపతులు బిరుదు సన్మాన జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంలో "సభ వారు నిర్ణయించిన "వాయులీన భీష్మాచార్య బిరుదును" అతిధిగా విచ్చేసిన శ్రీ గుమ్ములూరి రామకృష్ణ ప్రసాద్ సభలో ఉద్ఘోషించారు. ఆపై డా॥ రామబ్రహ్మం గారితోకలిసి జ్ఞాపిక బహూకరణలో పాల్గొన్నారు. అనంతరం సొసైటీ సభ్యులందరూ కలిసి సన్మాన పత్రాన్ని గురువుగారికి అందించారు. చివరగా పద్మశ్రీ నాదసుధార్ణవ, వాయులీన భీష్మాచార్య శ్రీ అన్నవరపు వారు మాట్లాడుతూ, తణుకులో జరిగిన ఈ ఆత్మీయ సన్మానం మరవలేనని, సన్మానపత్రం రూపొందించిన కమలాదేవిని "సంగీత సాహిత్య శిరోమణి" గా నేను ప్రకటిస్తున్నాను!! అన్నారు.



సభాకార్యక్రమం ఎంత ఆనంద భరితంగా జరిగిందో, అంత చక్కని సంగీత కార్యక్రమాన్ని అందించారు కుమారీలు జయతి, మహతిలు. అన్నవరపు వారి రచన హిందోళ వర్ణంతో

ప్రారంభించి, నీ దయరాదా, స్వాగతం కృష్ణా., గోవర్ధనగిరి., తిల్లానా... చాలా అద్భుతంగా పాడారు. వారి తండ్రి శ్రీ నందకుమార్ వైలెన్, శ్రీ అనిల్ మృదంగంలతో కచేరీ విన్న శ్రీ రాంబాబు గారు తమ సభలో యంగ్ టాలెంట్ అవార్డ్ కి ఆహ్వానించారు. ఆ చిరంజీవులను గురువు గారితో పాటు సభాసదులందరూ అభినందించారు.



శ్రీమతి జొన్నలగడ్డ రామలక్ష్మి గారి వందన సమర్పణతో కార్యక్రమం సుసంపన్నమయింది.

ముందుగా మంగళ వాద్యములతో, సంగీత కళాశాల బాలికలు బాట పొడవునా పుష్పాంజలులు సమర్పిస్తుంటే పూర్ణకుంభంతో, వేదఘోషతో సభాభవనం ప్రవేశించి, ఆశీనులై అర్చకస్వాములు వేద ఆశీర్వచనం అందుకున్నారు.

## శ్రీరామ గాన సభలో హరిప్రియ గానం

హైదరాబాద్ న్యూ నల్లకుంట రామాలయంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలలో భాగంగా తేది 19.3.2022 శనివారం సాయంత్రం 5.30 గ౹౹లకు శ్రీమతి హరిప్రియ (వేమూరి సతీష్ భరత్, కొమాండూరి శౌరి రాజన్ శిష్యులు) శాస్త్రీయ భక్తి సంగీతం భక్తులను ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాగంగా, శరణు సిద్ధి వినాయక – హామీర్ కళ్యాణి రాగం; దశరథ నందన – అసావేరి రాగం; గానమూర్తె – గానమూర్తి రాగం; రామ కోదండ రామ – భైరవి రాగం; సారస నేత్ర – శంకరాభారణ రాగం ఈ రచనలను వినిపించారు. ఈ కార్యక్రమానికి శ్రీ వినయ్ కృష్ణపొలాస వయోలిన్‌పై, శ్రీ పి.దుర్గా కుమార్ మృదంగంపై వాద్య సహకారం చేసారు. అనంతరం కార్యక్రమ నిర్వహకులు శ్రీ కొణికి శ్రీనివాస శర్మ కళాకారులను సత్కరించారు.

## శ్రీ విజయ త్యాగరాజ సంగీతసభ – విశాఖ

స్థానిక శ్రీ శంకరమఠం సహకారంతో శ్రీ విజయ త్యాగరాజ సంగీత సభ అమృతోత్సవ ముగింపు వేడుకలు మార్చ్ 3వ తేదీ నుండి 6వ తేదీవరకు ఘనంగా నిర్వహించబడినవి.

మొదటిరోజున విదుషి శ్రీమతి వి.తులసి విశ్వనాథ్ గాత్ర సంగీత సభకు "సంగీత సుధానిధి" డా.వేదుల గౌరి రామమోహన్ జ్యోతి ప్రదీపనతో శుభారంభం గావించినారు.

విదుషి శ్రీమతి వి.తులసి విశ్వనాథ్ గాత్ర కచేరినీ "ఎవరి బోధన" అభోగి రాగ వర్ణంతో ఆరంభించి, బిలహరి రాగంలో "ఏకదంతం భజేహం", పూర్వీకల్యాణిలో అరుదుగా వినపడే మైసూరు సదాశివరావు రచన "గంగాధర త్రిపురహరా", భైరవి రాగంలో రాగం – తానం– పల్లవి "దేవి శ్రీ త్రిపురసుందరి దీన దయాపరి జగదీశ్వరి" అత్యంత మధురంగా ఆలపించి, బాలమురళి అహిర్ భైరవి థిల్లానాతో ముగించారు.



వయొలిన్ పై విద్వాన్ మావుడూరి సత్యనారాయణ శర్మ మృదంగంపై శ్రీ సుసరావు సుబ్రహ్మణ్యం మరియు ఘటంపై శ్రీ మావుడూరి సూర్యప్రసాదరావు సహకారమందించి గాత్ర సభను రక్తికట్టించారు.

రెండవ రోజున విదుషి శ్రీమతి మంథా శ్రీ రమ్య వాయులీన సభకు "సంగీత సుధానిధి" విద్వాన్ శ్రీ ముట్నూరి శ్రీనివాస నరసింహమూర్తి జ్యోతిప్రదీపనతో శుభారంభం గావించినారు.



"చలమేల" నాటకురంజి రాగ వర్ణంతో ఆరంభించి, నాట రాగంలో "శ్రీ మహాగణపతే", చంద్రజ్యోతి రాగ కృతి బాగయెనయ్య", ముఖ్యాంశంగా మోహన రాగంలో త్యాగరాజ కృతి, లఘు రాగం – తానం– పల్లవి "రామ నను బ్రోవరా వేగమే అతివేగమే" వాయించి రాగమాలికలో హరికాంభోజి, వలజి, కాపి, కదనకుతూహలం రాగాలలో అతి మధురంగా ఆలపించి, లాల్గుడి రాగేశ్రీ థిల్లానతో ముగించారు.

శ్రీమతి మండ సుధారాణి జ్యోతిప్రదీపనతో శుభారంభం గావించినారు, వారితో అధ్యక్షులు శ్రీ చాగంటి సన్యాసిరాజు, ఉపాధ్యక్షులు శ్రీమతి వేదుల సూర్యాకాంతం డా. అలహరి సింగరి గారూ పాలు పంచుకున్నారు.

అనంతరం యువకళాకారులకు బంగారు పతక ప్రదానోత్సవసభలో శ్రీ జొన్నలగడ్డ సత్యశ్రీరాంకు శ్రీ చాగంటి సన్యాసిరాజు బంగారుపతకం; కీ.శే.డా.అలహరి సింగరి స్మారక బంగారు పతకం కుమారి ఎన్.వి.ఎస్.ఎల్.ప్రసన్నకు; కీ.శే.చాగంటి అన్నపూర్ణా భవాని స్మారక బంగారుపతకం కుందుర్తి అరవింద్‌లకు ముఖ్య అతిధి "సంగీత సుధానిధి" విదుషి శ్రీమతి మండ సుధారాణి చేతుల మీదుగా ప్రదానం గావించబడినది.

అనంతరం కచేరీలో బంగారు పతక గ్రహీతలు, శ్రీ జొన్నలగడ్డ సత్యశ్రీరాం గాత్రం, ఎస్.వి.ఎస్.ఎల్.ప్రసన్న వాయులీనం మరియు కుందుర్తి అరవింద్ మృదంగంతో తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించి సభాసదుల మన్ననలు పొందారు.



మార్చి 6వ తేదీన ఉదయం సద్గురు త్యాగరాజ ఆరాధన, కార్యక్రమములకు ప్రముఖ చెన్నై గాత్ర విద్వాంసుడు విద్వాన్ ఎస్.శశికిరణ్ విచ్చేసారు. పంచరత్న సేవలో స్థానిక సంగీత విద్వాంసులు పాల్గొని కడురమ్యముగా ఘనరాగ పంచరత్న ములనాలపించినారు.

తదుపరి శ్రీసోదరీమణులు కుమారి శ్రేయ, కుమారి శ్రీజ ల గాత్ర యుగళ సంగీత సభలో నాటరాగంలో పురందర దాస కృతి "జయ జానకికాంత", పంతువరాళి రాగంలో అయ్యవారి "అప్పరామభక్తి" కీర్తన, ముఖ్యాంశముగా ఖరహరప్రియ రాగ కృతి "ప్రక్కల నిలబడి", కదు హృద్యంగా ఆలపించినారు. వీరికి వాయులీనంపై కుమారి గాయత్రి విభావరి, మృదంగంపై ఎం.కామేష్, ఘటంపై ఏ.ఎస్.ఆర్.కౌండిన్య సహకరించి కచేరికి నిండుతనం కూర్చారు.



సాయంత్రం సభకు ముఖ్య అతిధిగా డా.ఎస్.విజయకుమార్, ఆత్మీయ అతిధిగా సంగీత సుధానిధి డా.మండపాక శారద, అధ్యక్షులు శ్రీ చాగంటి సన్యాసిరాజు జ్యోతిప్రకాశన గావించి ప్రముఖ వైణిక విద్వన్మణి విదుషి డా.రామవరపు మాధురిదేవికి కుంకుమ, చందన సత్కారాలతో "సంగీత సుధానిధి" బిరుదు ప్రదానం గావించారు. సభలో ఆసీనులైన ప్రముఖ సంగీత కళాకారులు, సంగీత సభల నిర్వాహకులు, సంగీత రసికులు డా.మాధురీదేవిని సన్మానించి ఆశీర్వదించినారు.



పిదప సంగీత సుధానిధి డా.మాధురీదేవి, ప్రముఖ మార్దంగికులు విద్వాన్ శ్రీపత్రి సతీష్‌కుమార్, ఘటవాద్య నిపుణులు విద్వాన్ శ్రీ సరస్వతుల హనుమంతరావు సహకరణలో అత్యంత మధురమైన వీణానాదంతో శహనలో "శ్రీ వాతాపి", అరుదుగా వినబడే ముత్తయ్య భాగవతార్ విజయసరస్వతి రాగ కృతి "శరణం విజయ సరస్వతి", పూర్ణ చంద్రికలో తెలిసి రామచింతనతో,



ముఖ్యాంశంగా హమీర్‌కళ్యాణి రాగ సద్గురు త్యాగరాజ కృతి "మానము లేదా", శ్రోత్రుమండలికి ఆవిష్కరించి మన్ననలను పొందారు. శ్రీ విజయ త్యాగరాజ సంగీతసభ అమృతోత్సవాలకు బహుచక్కని ముగింపునిచ్చారు.

## శ్రీ త్యాగరాజ సంగీత సభ, రామచంద్రపురం

గాయత్రి బ్రాహ్మణ సమితి ట్రస్ట్, శ్రీ త్యాగరాజ సంగీత సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పంచాంగ శ్రవణం, ఉగాది సంగీత వాహిని కార్యక్రమము ఆద్యంతం అద్భుతముగా జరిగినది. తొలుత గాయత్రి బ్రాహ్మణ సమితి ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ విల్లూరి కృష్ణానంద మూర్తి సభకు ఆహ్వానం పలకగా, శ్రీ త్యాగరాజ సంగీత సభ అధ్యక్షులు డా॥ శిష్టఅమ్మన్నపంతులు, శ్రీ అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు లచే గాయత్రి మాత, శ్రీ త్యాగరాజస్వామి చిత్రపటములకు పుష్పామాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి సభ కార్యక్రమము ప్రారంభించడం జరిగినది.

శ్రీ అమ్మవాజ్జుల సీతారామయ్య పంచాంగ శ్రవణ కార్యక్రమము నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీ అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన "ఉగాది సంగీత వాహిని" కార్యక్రమము శ్రీ త్యాగరాజ సంగీత సభ ట్రస్ట్ సెక్రటరీ శ్రీ తటవర్తి శ్రీనివాస్ ప్రారంభిస్తూ సభాధ్యక్షులుగా బి.ఎస్.ఎస్. శాస్త్రి ముఖ్య అతిధిగా డాక్టర్ శ్రీ యనమండ్ర శ్రీనివాస్ శర్మ , ట్రస్ట్ డైరక్టర్స్ శ్రీ మునుగంటి వెంకటరావు, శ్రీ అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు శ్రీ టి.ఎన్.వెంకటరామన్, ట్రస్ట్ కన్వీనర్లు శ్రీ తటవర్తి రాఘవరాజు, శ్రీ విల్లూరి కృష్ణానంద మూర్తి, శ్రీ కొండేపూడి జోగన్నలను వేదికపైకి ఆహ్వానించడం జరిగినది. వేద పురోహితులు శ్రీ చెరుకుపల్లి గణేష్ శర్మ, శ్రీ కొత్తపల్లి శివ వేద ఆశీర్వచనములతో శ్రీ అద్దంకి వెంకట ప్రభాకర రామచంద్రరావు నూతన వస్త్రములతో శ్రీ యనమండ్ర శ్రీనివాస శర్మగారిని సత్కారం చేసినారు.



డా॥ యనమండ్ర శ్రీనివాస శర్మ గాత్ర కచేరీకి శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి-వయోలిన్, శ్రీవారణాసి శ్రీనివాస్-మృదంగం, శ్రీ అనిపిండి అనిల్‌కుమార్- కంజిరతో సహకరించగా "ఉగాది సంగీత వాహిని" 2 గంటలు వారి ప్రేక్షకులను ఎంతో అలరించింది.

శ్రీ తల్లాప్రగడ సంతోష్, త్రిభువన్ యు.ఎస్.ఎ, శ్రీ పెదపాటి సుభాష్ చంద్రబోస్, శ్రీ ఆకెళ్ళ జగన్నాథం గారి సౌజన్యంతో30 మంది వృద్ధులకు పారితోషికములు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమము చేయుటకు అద్భుతమైన వేదికను సమకూర్చిన గాయత్రి బ్రాహ్మణ సమితి ట్రస్ట్ సెక్రటరీ శ్రీ ఆరాధి శ్రీధర్ గారికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమమును విజయవంతం చేయడానికి సహకారం అందించిన శ్రీ పూలపల్లి విజయకుమార్, శ్రీ చెరుకుపల్లి రామ్మూర్తి శ్రీ బులుసు సూర్యనారాయణ, శ్రీ మానప్రగడ రతిమోహనరావు , శ్రీ తెలిదేవర రామారావు తదితరులకు హృదయ పూర్వక ధన్యవాదాలు.

## శ్రీరామగాన సభ - హైద్రాబాద్
## సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవములు

శ్రీరామగానసభ ఆధ్వర్యంలో "సద్గురు శ్రీ త్యాగరాజస్వామి" వారి 53వ వార్షిక ఆరాధనా సంగీత ఉత్సవములు శ్రీరామాలయం న్యూ నల్లకుంట, హైదరాబాదు ప్రాంగణంలో జరిగాయి. ఈ ఉత్సవాలు 16.3.22 నుండి 20.3.22 వరకు (5 రోజులు) విశిష్టంగా జరిగాయి.

16.3.22 బుధవారం మంగళ వాయిద్యంతో ప్రారంభించి అనంతరం "నాదోపాసన బృందం" వర్ధమాన కళాకారులు, బాలబాలికలచే దివ్యనామ సంకీర్తనలు ఆలపించారు. తరువాత ప్రముఖ సాహితీవేత్త సంగీత అభిమాని శ్రీ ఓలేటి పార్వతీశం,

జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభం చేసారు. వారి ప్రసంగంలో కీ॥శే॥ కొణికి సత్యనారాయణ సంకలనం చేసిన "శ్రీ కృష్ణ లీలా తరంగిణి" భావార్థ సహిత తాత్పర్యంతో ముద్రించిన పుస్తక ఆవిష్కరణ చేసి వాటి యందు గల విశేషాలను వివరించారు. తరువాత "కొణికి" వారు 50 సం॥లకు పైగా సభను నిర్వహించిన తీరును ఘనంగా వర్ణించారు.

అనేక వర్ధమాన కళాకారులకు అవకాశం కల్పించి ఇవ్వాల్టి రోజున వారిలో ఎందరో ఎ.ఐ.ఆర్ లో గ్రేడ్‌లు పొంది ప్రసిద్ధ కళాకారులుగా రాణించారు అని తెలియచేసారు. వారి కృషి ఎంతైనా అభినందనీయం అని, సభను ఇదే విధంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. తదుపరి వైణిక విద్వాంసులు శ్రీమతి 'అచలాశంకరనాథ్" గారి వీణాగానములో "శ్రీ గణపతిని సేవింపరారే" సౌరాష్ట్ర "జ్ఞానమొసగరాదా"; పూర్వి కళ్యాణి "ఎందుకు పెద్దలవలె" - శంకరాభారణం వాయించారు. రాగాలాపన, స్వరకల్పన, నెరవు వేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తరువాత బేహాగ్‌లో తిల్లాన వాయించారు. వీరికి మృదంగంపై పి.విద్యాసాగర్, ఘటంపై జనార్ధన్ చక్కగా సహకరించారు. సంగీత అభిమానులు పాల్గొన్నారు.

17.3.22 గురువారం రెండవరోజు "శ్రీ నేద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్టు వారిచే సంకీర్తనం జరిగింది. ఇందులో నేద్రగంటి కృష్ణమోహన్ పలు రామదాసు కీర్తనలు గానం చేశారు. తరువాత శ్రీమతి సరస్వతి గానం చేశారు.

ప్రధానంగా శ్రీ పి.వి. సుబ్బారావు గాత్ర కచేరి జరిగింది. మొదటగా "శ్రీ రఘుకులమందు"; వర నారద - విజయశ్రీ రాగంలో; "జ్ఞానమొసగరాదా" పూర్వి కళ్యాణి మధురమైన రాగాలాపన నెరవు, స్వరకల్పన చేసి సంగీత రసికులను ఆకట్టుకున్నారు.

వీరికి కర్రా శ్రీనివాస్ మృదంగంపై చక్కటి సహకారం అందించి శ్రోతలను ఆకట్టుకున్నారు. "శ్రీ శివకృష్ణప్రసాద్" వయొలిన్‌పై చక్కగా సహకరించారు.

18.3.22 శుక్రవారం మూడవరోజు కుమారి భావిత అన్నంగి - గానం చేసారు. వీరికి కుమారి శ్రీ విద్య, వినయకృష్ణ, వయోలిన్‌పై మరియు "డి.వి.ఎస్.ప్రణవ్" కాసియో పై "మాస్టర్ శ్రీకర్" మృదంగంపై సహకరించారు.

తదుపరి "శ్రీమతి రమ్యశ్రీనివాస్" గానం చేసారు. వీరికి కోలంక సాయికుమార్ వయొలిన్‌పై దుర్గాకుమార్ మృదంగంపై సహకరించారు.

తదుపరి ప్రధానంగా "శ్రీమతి అరుణ మరియు శ్రీమతి పద్మ" యుగళగానం కచేరి జరిగింది. వీరికి "కోలంక సాయికుమార్" వయొలిన్‌పై మరియు "పెరవలి జయభాస్కర్" మృదంగంపై, ఘటంపై "టి.పి. బాలసుబ్రమణియన్" సహకరించారు.

నిన్నే భజన నాటరాగం; వినరాదా/ దేవ గాంధారి, నీదయరాదా, కంట జూడుమా', కలిగివుంటే గదా? కీరవాణిలో చక్కటి రాగాలాపన, స్వరకల్పన చేసారు.



వీరికి మృదంగంపై జయభాస్కర్, అందమైన నడకలు, ముక్తాయింపులతో సొంపుగా వాయించారు. శ్రీ టి.పి. బాలు ఘటంపై సొంపుగా వాయించారు. సంగీత అభిమానుల హర్షధ్వానాల మధ్య కచేరి ఆద్యంతం రక్తిగా సాగింది.

19.3.2022 శనివారం నాల్గవరోజు మొదటిగా శ్రీమతి డి.వి.ఎస్. హరిప్రియ గానం చేసారు. వీరు ప్రధానంగా "దశరథనందన"; "గానమూర్తే" గానం చేసారు.

తరువాత కొణికి మణిరఘురాం గానం చేసారు. వారు "వనజాక్షి" వర్ణంతో మొదలుపెట్టి 3 కాలాలు పాడారు. "బ్రోవభారమా" బహుదారి, "శంభోమహదేవ" పంతువరాళి ప్రధానంగా "బంటురీతికొలువు" హంసానందిని రాగం చక్కటి ఆలాపన, నెరవు, మంచి ముక్తాయిలతో స్వరకల్పనలు చేసి ప్రేక్షకులను రంజింప చేసారు. వీరికి వయొలిన్‌పై "శ్రీ భాగవతుల సీతాపతిరావు"; మృదంగంపై "శ్రీ పి.దుర్గాకుమార్" ప్రేక్షకుల మన్ననలతో చక్కగా కచేరి రక్తి కట్టించారు. ఆఖరున "తిల్లాన" పాడి కచేరి ముగించారు.

సాయంత్రం 7 గం॥లకు ప్రధానంగా "లయ కళావిపంచి" బిరుదాంకితులు శ్రీ పెరవలి "జయభాస్కర్" ఆధ్వర్యంలో "స్వరలయ సుధ" వాద్య సమ్మేళనం జరిగింది.

ఇందులో ప్రధానంగా "శ్రీపెరవలి జయభాస్కర్" మృదంగంపై "శ్రీ కుమారి వి.ఎస్.ఆర్.గాయత్రి శివాని వయొలిన్‌పై శ్రీ "పి.మల్లిఖార్జున్" ఘటంపై "శ్రీ యమ్.చంద్రకాంత్" ముఖ శంఖంపై; శ్రీ పి.మురళి" తబలపై సహకరించారు.




ఈ కార్యక్రమంలో "శ్రీ కుమరి వి.ఎస్.వి. గాయత్రిశివాని" వయోలిన్‌పై మొదటగా"జగదానంద కారక"; "శంభో మహదేవ" తరువాత కీరవాణి రాగంలో పల్లవి "సద్గురు త్యాగరాజ నమస్తే రామచంద్రాయ భక్తాయ" అద్భుతంగా వాయించారు. ఆది తాళంలో రాగమాలికలో స్వరకల్పన చేసారు. తరువాత "శ్రీ పెరవలి జయభాస్కర్" అనేక గతులను తని ఆవృతంలో సొగసుగా వినిపించారు.

చతురశ్రం, తిశ్రం, ఖండజాతి త్రిశ్రగతి, మరియు ఖండజాతి పైకాలంలో అద్భుతంగా వాయించి సాంప్రదాయ బద్ధంగా తగ్గింపు నడకలు మొహరా ముక్తాయి వాయించి ప్రేక్షకులను, సంగీత అభిమానులను, మంత్ర ముగ్ధులను చేసారు. అడుగడుగన ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య లయవిన్యాసం అద్భుతంగా సాగింది. 20.3.22 ఆదివారం 5 వరోజు ఆఖరిరోజు ఉదయం శ్రీ త్యాగరాజ స్వామివారికి "శ్రీ జ్ఞానేశ్వర్" పురోహితులచే పూజాదికాలు గావించారు.

అనంతరం శ్రీ కొమాండూరి అనంతశౌరి రాజన్ శిష్యులు పలుకీర్తనలు గానం చేసారు. తరువాత మాస్టర్ డి.వి.ఎస్.ప్రణవ్" "పాహిరామచంద్ర" మరియు దివ్యనామ సంకీర్తనలు పాడుతూ క్యాసియోపై చక్కగా వాయించారు.

తరువాత శ్రీమతి "కొణికి ఆమని రఘురామ్" రెండు దివ్యనామ సంకీర్తనలు గానం చేసారు. వీరికి వినయకృష్ణ వయోలిన్‌పై; కొణికి మణిరఘురాం మృదంగంపై సహకరించారు.

ఆ తరువాత శ్రీయుతులు ఆర్.వి. పాండురంగ శర్మ ఆధ్వర్యంలో రామాలయ ప్రాంగణంలో పలుకీర్తనలు, మరియు "రామనామము" తో గానం చేసి వైభవంగా "ఉంఛవృత్తి" నిర్వహించారు. వీరికి కొమాండూరి రాజన్, కె.ఎల్.ఎన్.మూర్తి, ఎన్.రామమూర్తి. ఎస్.చంద్రశేఖర్ సహగానం చేసారు.

అనంతరం "పంచరత్నసేవ" జరిగింది.

ఇందులో నగర ప్రముఖ విద్వాంసులు శ్రీ ఎన్.శ్రీరామమూర్తి; శ్రీ వాసా గోపీనాథరావు; శ్రీ ఎస్.చంద్రశేఖర్; శ్రీ కొమాండూరి అనంతశౌరిరాజన్; శ్రీ పి.వి.సుబ్బారావు; శ్రీ కె.ఎస్.ఆచార్యులు గానం చేసారు.

మృదంగంపై శ్రీ పెరవలి జయభాస్కర్; శ్రీ కర్రా శ్రీనివాస్, శ్రీ పి.దుర్గాకుమార్; శ్రీరాహుల్ సుందర్; శ్రీ కొణికి మణి రఘురాం; శ్రీ కొమాండూరి కృష్ణతేజ సహకరించారు.

వయెలిన్‌పై ప్రధానంగా శ్రీ ఎస్.వి.రమణమూర్తి; శ్రీ కె.ఎల్.ఎన్.మూర్తి; శ్రీ వినయకృష్ణ; కొమాండూరి జయరాం సహకరించారు.



సాయంత్రం యక్షగాన కంఠీరవ బిరుదాంకితులు డా॥పసుమర్తి శేషుబాబు శిష్యబృందంచే శాస్త్రీయ కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. దీనిలో బాలికలు, వర్ధమాన కళాకారులు పలు అంశాలపై నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకులను రంజింపచేసారు.

వీరికి నట్టువాంగం పై శేషుబాబు, శ్రీమతి సాయిబాల గాత్రం అందించారు. ఫ్లూటుపై వి.వెంకటేశ్వర్లు, మృదంగంపై శ్రీధరాచారి సహకరించారు.

అనంతరం కార్యదర్శి కొణికి సాయి శ్రీనివాస్ శర్మ హనుమాన్ చాలీసా రాగ మాలికగా ఆలపించారు. అందరూ సహగానం చేసారు. తరువాత స్వామివారికి మంగళహారతి ఇచ్చి స్వస్తి వాచకం పలికారు.

**– రిపోర్ట్ శ్రీ కొణికి శ్రీనివాసశర్మ, శ్రీ పాలపర్తి వెంకట సుబ్బరావు.**




**మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో గానం చేసిన సీనియర్ సంగీత విద్వాంసులు శ్రీ కె.వి.బ్రహ్మానందం.**